తెలుగు దినపత్రిక

RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice

వార్త పత్రిక

03-06-2026

బుధవారం హైదరాబాద్

సంపుటి: (volume): I

సంచిక: (ISSUE): 117

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి

People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575




తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice వార్త పత్రిక
03-06-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 117
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

# ఆదిలోనే హంసపాదు!

- రైతు డిస్కమ్‌కు లభించని లైసెన్స్..

సీఎం ప్రకటించిన జూన్ 2న ప్రారంభానికి నోచుకోని వైనం
బ్యూరోక్రాట్ల అతివల్లే సమస్య జటిలం
రూ.35 వేల కోట్ల అప్పులతో కొత్త సంస్థ
తక్కువ సిబ్బందితో భారీ కనెక్షన్ల నిర్వహణ కష్టమే.
సీఎంను తప్పుదోవ పట్టించిన ఓ సీనియర్ ఐఏఎస్?
అధికారి మొండివైఖరిపై విద్యుత్ వర్గాల్లో తీవ్ర చర్చ
రైతు డిస్కమ్ గందరగోళంతో ఆగిపోయిన బదిలీలు
విద్యుత్ శాఖ ఉద్యోగుల్లో మొదలైన తీవ్ర సందిగ్ధత
సమస్యల నేపథ్యంలో మరికొన్ని రోజులు వాయిదా

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం ఏర్పాటు చేయాలని సంకల్పించిన రైతు డిస్కమ్ ప్రారంభోత్సవానికి ప్రారంభంలోనే హంసపాదు ఎదురైంది. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 2వ తేదీన ఈ కొత్త డిస్కమ్‌ను ప్రారంభిస్తామని అధికారికంగా ప్రకటించినప్పటికీ, అనుకున్న తేదీకి సంస్థ ప్రారంభానికి నోచుకోలేదు. విద్యుత్ నియంత్రణ మండలి నుండి దీనికి సంబంధించిన లైసెన్స్ మంజూరు కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. జలమండలి, మిషన్ భగీరథ లాంటి ప్రభుత్వ రాయితీ విభాగాలను వ్యవసాయ విద్యుత్‌తో కలిపి ఈ మూడో డిస్కమ్‌ను ఏర్పాటు చేసేందుకు గతంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీగా పనిచేసిన ముషారఫ్‌ను దీనికి సీఎండీగా నియమించారు. అయితే, ఈ ప్రక్రియలో అటు ప్రజల అభిప్రాయాలను, ఇటు ఉద్యోగ సంఘాల సలహాలను తీసుకోకుండా మేనేజ్‌మెంట్ ఏకపక్షంగా వ్యవహరించడం ఇప్పుడు ప్రభుత్వ పాలిట శాపంగా మారింది.
ఈఆర్సీ బహిరంగ విచారణలో దొరికిపోయిన యాజమాన్యం విద్యుత్

మిగతా 2వ పేజీలో..

# పుష్కర తెలంగాణ.. ముష్కరుల తెలంగాణగా మారింది: కేటీఆర్

- తెలంగాణ సాధనలో కేసీఆర్ పాత్రను గుర్తు చేసిన కేటీఆర్
- అభివృద్ధి రాష్ట్రాన్ని వెనక్కి నెడుతున్నారని ఆరోపణ
- గ్యారంటీల పాలనతో వ్యవస్థలు దెబ్బతింటున్నాయని వ్యాఖ్య
- 2028లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్న ధీమా

3



# తెలంగాణ మీ అయ్య జాగీరా..?: పవన్ కల్యాణ్

- తెలంగాణ ప్రజల సమస్యలపై మాట్లాడే హక్కు జనసేనకు ఉంది
- బెదిరింపులకు భయపడే వ్యక్తిని కాదన్న పవన్
- భూకబ్జా ఆరోపణలపై విచారణకు సిద్ధమని సవాల్
- తెలంగాణలో జనసేనను మరింత బలోపేతం చేస్తామని వెల్లడి

**హైదరాబాద్, జూన్ 2, సిరి న్యూస్:**
తెలంగాణలో ప్రజల సమస్యలపై స్పందించడం జనసేన పార్టీ బాధ్యత అని ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. తెలంగాణ ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని, ప్రజా సమస్యలపై మాట్లాడే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి

మిగతా 2వ పేజీలో..



# తెలంగాణ మా అయ్యా జాగిరే: పొన్నం ప్రభాకర్

- పవన్ కళ్యాణ్‌పై మంత్రి ఘాటు విమర్శలు
- గద్దర్‌పై వ్యాఖ్యలు బాధాకరమని ఆగ్రహం
- తెలంగాణ అస్తిత్వాన్ని కించపరిస్తే ఊరుకోమని హెచ్చరిక
- పెయిడ్ ఆర్టిస్ట్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపణ
- బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

2



# జర్నలిస్టులకు ఇళ్లు.. ఆరోగ్యశ్రీకి నెలకు రూ.150 కోట్లు

మీడియా సంక్షేమంపై ప్రభుత్వం కట్టుబడి ఉంది
సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 10 వేల కొత్త బెడ్‌లు
రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగిస్తామని స్పష్టీకరణ
2028 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యర్థులే లేరన్న భట్టి
ధాన్యం కొనుగోళ్లపై బీజేపీపై విమర్శలు

**ఖమ్మం, జూన్ 2, సిరి న్యూస్:**
తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్ల కేటాయింపు అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని చెప్పారు. ఈ సమస్య పరిష్కారం

మిగతా 2వ పేజీలో..



# ఈవేలంతో రూ.202 కోట్ల ఆదా

- మొక్కజొన్న విక్రయాల్లో మార్క్‌ఫెడ్‌కు భారీ లాభం
- కొత్త విధానంతో రాష్ట్ర ఖజానాకు అదనపు ఆదా
- 3.80 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వల విక్రయం పూర్తి
- గోదాములు ఖాళీ చేసి యాసంగి పంటలకు సిద్ధం



**హైదరాబాద్, జూన్ 3, సిరి న్యూస్:**
మార్క్‌ఫెడ్ ద్వారా నిల్వ ఉన్న మొక్కజొన్నను వినూత్న ఈవేలం విధానంలో విక్రయించడం వల్ల రాష్ట్ర ఖజానాకు రూ.202.56 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వానాకాలం సీజన్‌లో సేకరించిన 3,80,187 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వలను కొత్త విధానంలో విక్రయించడం


మిగతా 3వ పేజీలో..

# తెలంగాణ బాగుపడాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి

కాళేశ్వరం అంశంపై సీఎం వ్యాఖ్యలపై విమర్శలు
కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనుకబడుతోందని ఆరోపణ
తెలంగాణ ఏర్పాటులో బీజేపీ పాత్ర కీలకమని వ్యాఖ్య
గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
కేంద్ర నిధులతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్న బండి



3



# నైరుతి రాక ఆలస్యం


- కేరళ తీరాన్ని తాకి మందగించిన రుతుపవనాల కదలికలు

3

# ఓటరు జాబితా ప్రక్షాళనకు వేగం

- ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలు
- రాజకీయ పార్టీలతో సమన్వయం పెంచాలని సూచన

3



# కొలువుల జాతర షురూ

- 290 ఇంజినీరింగ్ పోస్టులకు TGPSC నోటిఫికేషన్లు

2



# 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష

- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం
- జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం 91 మంది

మిగతా 2వ పేజీలో..

# తెలంగాణ మీ అయ్య జాగీరా..?: పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి

ఉంటుందని అన్నారు.
హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన పవన్ కళ్యాణ్, జనసేన పార్టీ ఆవిర్భావం హైదరాబాద్‌లోనే జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో జనసేన కార్యకర్తలు ఉన్నందున రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై స్పందించడం సహజమేనన్నారు. తెలంగాణపై తమకు ఇప్పుడే ఆసక్తి కలగలేదని, మొదటి నుంచి రాష్ట్ర ప్రజలతో అనుబంధం కొనసాగుతోందని చెప్పారు.
తాను తెలంగాణలోని అనేక ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నానని పవన్ తెలిపారు. ఆదిలాబాద్ సహా పలు జిల్లాల్లో తిరిగిన అనుభవం తనకు ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం విమర్శలు చేస్తున్న కొందరు నాయకులు అప్పట్లో ఆ ప్రాంతాల గురించి పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తాను వ్యతిరేకించలేదని, రాష్ట్ర విభజన జరిగిన విధానంపై మాత్రమే తనకు అభ్యంతరాలు ఉన్నాయని పవన్ స్పష్టం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, రెండు రాష్ట్రాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి ముందుకు సాగాలని అన్నారు.
తనపై వస్తున్న విమర్శలు, హెచ్చరికలను ప్రస్తావిస్తూ, బెదిరింపులకు తాను భయపడే వ్యక్తిని కాదన్నారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తిగా ఎలాంటి ఒత్తిళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటానని చెప్పారు. భూకబ్జాలకు సంబంధించిన ఆరోపణలపై స్పందిస్తూ, తనపై వచ్చిన ప్రతి ఆరోపణను విచారించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ భూములు లేదా చెరువులను ఆక్రమించినట్లు నిరూపితమైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చని సవాల్ విసిరారు. గద్దర్ గురించి మాట్లాడుతూ, ఆయనకు అవసరమైన సమయంలో తాను సహాయం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గద్దర్ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో తనవంతు సహకారం అందించానని తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరిస్తామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో జనసేన క్రియాశీలక పాత్ర పోషిస్తుందని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజా సమస్యలపై స్వరం వినిపిస్తానని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

# తెలంగాణ మా అయ్యా జాగిరే: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూన్ 2, సిరి న్యూస్:

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని అవమానించేలా చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీస్తాయని విమర్శించారు.
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది ఉద్యమకారులు పోరాడారని, అమరవీరుల త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని మంత్రి గుర్తు చేశారు. అలాంటి ఉద్యమ చరిత్రను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అమరవీరుల కుటుంబాల సంక్షేమం గురించి పవన్ కళ్యాణ్ ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు.
ఉద్యమ కవి, ప్రజాగాయకుడు గద్దర్‌పై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను ఎవరూ తక్కువ చేసి చూడలేరన్నారు. గద్దర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, వాటిపై పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావించిన మంత్రి, ప్రజల సొమ్ముతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వ్యక్తిగత ఆస్తులుగా చిత్రీకరించడం సరికాదన్నారు. తెలంగాణ అభివృద్ధిపై అనవసర వ్యాఖ్యలు చేయడం కంటే వాస్తవాలను గుర్తించాలని సూచించారు. తెలంగాణకు వచ్చిన అతిథిగా పవన్ కళ్యాణ్‌కు గౌరవం ఇచ్చామని, అయితే రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ప్రజలు సహించరని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తెలంగాణలో ఎవరు వచ్చినా స్వాగతమే కానీ రాష్ట్ర అస్తిత్వాన్ని కించపరిచే ప్రయత్నాలను అంగీకరించబోమన్నారు. పవన్ కళ్యాణ్ ఒక పెయిడ్ ఆర్టిస్ట్‌లా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన మంత్రి, ఆయన రాజకీయ వ్యాఖ్యల వెనుక ఎవరి స్క్రిప్ట్ ఉందో ప్రజలకు చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమం, గద్దర్ వంటి వ్యక్తుల గురించి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని మరోసారి డిమాండ్ చేశారు.

# 91 మంది ఖైదీలకు క్షమాభిక్ష

మొదటిపేజీ తరువాయి

ఖైదీలకు క్షమాభిక్ష మంజూరు చేసిందని జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా వెల్లడించారు. ఆ ఖైదీలు మంగళవారం జైళ్ల నుంచి విడుదలయ్యారని తెలిపారు. విడుదలవుతున్న ఖైదీలు సమాజంలో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని, మళ్లీ జైలు బాట పట్టకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆమె సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. విడుదల అవుతున్న వారిలో 85 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. వీరిలో 38 మంది జైళ్ల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో పనిచేయడానికి ఆసక్తి చూపినట్లు డీజీ తెలిపారు. వారికి మంగళవారం నియామక పత్రాలు అందజేసినట్లు చెప్పారు. మిగిలిన 53 మంది వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలని నిర్ణయించుకున్నారని, వారికి కూడా అవసరమైన సహకారం అందిస్తామని వెల్లడించారు. విడుదల అవుతున్న మహిళా ఖైదీల్లో నలుగురికి కుట్టు మిషన్లు అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. విడుదల పొందిన వారు బాధ్యతాయుతంగా జీవించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకుంటే.. జైళ్ల శాఖ చేసిన కృషి ఫలించినట్లవుతుందని సౌమ్యా మిశ్రా పేర్కొన్నారు. గత ఏడాది కొత్త ప్రభుత్వం 213 మంది ఖైదీల విడుదలకు అనుమతి ఇవ్వగా, ఈసారి మరో 91 మందికి క్షమాభిక్ష మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ప్రత్యేక జీవో జారీ చేసిన ప్రభుత్వం, అర్హులైన ఖైదీలకు ఏడాదిలో మూడు సార్లు క్షమాభిక్ష ఆధారంగా విడుదల అవకాశాలు కల్పించే విధానాన్ని అమలు చేస్తోందని వెల్లడించారు.





# తెలంగాణ రైజింగ్-2047..

# ప్రపంచానికి గేట్‌వేగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి



అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని హక్కుగా కాకుండా బాధ్యతగా భావిస్తూ ప్రజా సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు.
వ్యవసాయ రంగాన్ని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదిగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. రైతుల రుణభారం తగ్గించేందుకు భారీ స్థాయిలో రుణమాఫీ అమలు చేశామని, రైతు భరోసా ద్వారా నేరుగా ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు.
మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని సీఎం వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, సున్నా వడ్డీ రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, తక్కువ ధరకు గ్యాస్ సిలిండర్ వంటి పథకాల ద్వారా మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.
యువతకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ భారీ స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టామని సీఎం తెలిపారు. వివిధ పోటీ పరీక్షల ద్వారా వేలాది ఖాళీలను భర్తీ చేశామని, మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.
విద్యా రంగంలో నాణ్యత పెంపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయాలు, ఆధునిక విద్యా కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు.
పేదలకు గృహ వసతి కల్పనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. సామాజిక న్యాయాన్ని బలోపేతం చేసే చర్యల్లో భాగంగా కుల గణన సర్వే నిర్వహించడంతో పాటు బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ ఉపవర్గీకరణ అంశాల్లో కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు.
ఆరోగ్య రంగంలో భారీ పెట్టుబడులు పెట్టి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని సీఎం చెప్పారు. కొత్త మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల నిర్మాణం, ఆరోగ్యశ్రీ పరిధి విస్తరణ వంటి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.
భవిష్యత్ అభివృద్ధి లక్ష్యాలను వివరిస్తూ, తెలంగాణను మూడు ప్రధాన అభివృద్ధి మండలాలుగా రూపొందించే ప్రణాళికను సీఎం వెల్లడించారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి సేవారంగ కేంద్రంగా, రింగ్ రోడ్ల మధ్య ప్రాంతాన్ని తయారీ పరిశ్రమల హబ్‌గా, మిగతా జిల్లాలను వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు.
2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణను దేశానికే కాకుండా ప్రపంచానికి గేట్‌వేగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఈ ప్రయాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పిలుపునిచ్చారు.

# కొలువుల జాతర షురూ

- 290 ఇంజినీరింగ్ పోస్టులకు TGPSC నోటిఫికేషన్లు
- ఆర్అండ్‌బీ శాఖలో 271 AEE ఖాళీలు
- కాలుష్య నియంత్రణ మండలిలో 19 పోస్టులు
- జూన్ 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- నిరుద్యోగ ఇంజినీర్లకు భారీ అవకాశం




హైదరాబాద్, జూన్ 2, సిరి న్యూస్:

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న ఇంజినీరింగ్ అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (TGPSC) శుభవార్త అందించింది. రాష్ట్రంలోని పలు శాఖల్లో ఖాళీగా ఉన్న 290 ఇంజినీరింగ్ పోస్టుల భర్తీకి మూడు వేర్వేరు నోటిఫికేషన్లు విడుదల చేసింది.
ఈ నియామకాల్లో అత్యధిక పోస్టులు రోడ్లు, భవనాల శాఖలో ఉన్నాయి. సివిల్ విభాగంలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (AEE) పోస్టులు, ఎలక్ట్రికల్ విభాగంలో 49 AEE పోస్టులను భర్తీ చేయనున్నారు. దీంతో ఆర్అండ్‌బీ శాఖలో మొత్తం 271 ఖాళీలను భర్తీ చేసే అవకాశం కల్పించారు.
అదే సమయంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో 19 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి కూడా ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ మూడు నోటిఫికేషన్లతో కలిపి మొత్తం 290 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు.
అభ్యర్థుల వయస్సు ఈ ఏడాది జూలై 1 నాటికి 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను విడతలవారీగా నిర్వహించనున్నారు. సివిల్ AEE పోస్టులకు జూన్ 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమై జూలై 13 వరకు కొనసాగుతుంది. ఎలక్ట్రికల్ AEE పోస్టులకు జూన్ 8 నుంచి జూలై 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. కాలుష్య నియంత్రణ మండలిలోని అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టులకు జూన్ 10 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై జూలై 17తో ముగుస్తుంది.
అర్హత కలిగిన అభ్యర్థులు TGPSC అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. విద్యార్హతలు, పరీక్షా విధానం, సిలబస్, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను నోటిఫికేషన్లలో పరిశీలించాలని కమిషన్ సూచించింది.
ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తున్న నేపథ్యంలో విడుదలైన ఈ నోటిఫికేషన్లు ఇంజినీరింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు కీలక అవకాశంగా మారనున్నాయి.



# నైరుతి రాక ఆలస్యం

తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్ :

దేశంలో నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యం కానుంది. కేరళ తీరాన్ని తాకడంలో రుతుపవనాల కదలికలు మందగించడమే అందుకు కారణమని తెలుస్తోంది. భారత వాతావరణ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం జూన్ ప్రారంభంలోనే దేశంలోకి ప్రవేశించాల్సిన రుతుపవనాలు మరో 3 నుంచి 4 రోజులు ఆలస్యంగా వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. తాజాగా వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జూన్ 5, 6 తేదీల్లో నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఈ నెల ఒకటో తేది నాటికే కేరళను తాకాల్సిన ఈ రుతుపవనాలు, ఈసారి కదలికలు మందగించడంతో ఆలస్యంగా రానున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న అసాధారణ వాతావరణ మార్పులు, వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ నైరుతి రుతుపవనాల రాకకు అడ్డంకిగా మారినట్లు నిపుణులు పేర్కొన్నారు. ఆ వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ ప్రభావం పూర్తిగా తొలగిపోతే గానీ రుతుపవనాల కదలికలు వేగవంతం కదలవని అభిప్రాయపడుతున్నారు. మరోవైపు రుతుపవనాల రాక ఆలస్యం కానుండటంతో దేశంలోని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోని రైతాంగంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్ సీజన్ పనుల కోసం వర్షాలపైనే ఆధారపడే రైతులు.. విత్తనాలు వేసే సమయం దాటిపోతుండటంతో ఆకాశం వైపునకు చూస్తున్నారు.

# మంగ్లీపై సోషల్ మీడియాలో కొత్త వివాదం

హైదరాబాద్, జూన్ 3, సిరి న్యూస్:

జానపద గాయని మంగ్లీ మరోసారి సోషల్ మీడియాలో విమర్శల కేంద్రంగా మారారు. గతంలో నిర్వహించిన ఓ సాంస్కృతిక కార్యక్రమంలో ఆమె పాడిన 'బండెనుక బండి గట్టి.. పదహారు బండ్లు గట్టి' పాటకు సంబంధించిన వీడియో తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా మళ్లీ వైరల్ అవుతోంది.
తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ప్రత్యేక స్థానం పొందిన ఈ పాటను గూడ అంజయ్య రచించారు. నిజాం పాలన, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించే ఈ గీతాన్ని ప్రదర్శించిన తీరుపై కొందరు నెటిజన్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పాటలోని భావోద్వేగం, చారిత్రక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వినోదాత్మక శైలిలో ప్రదర్శించారని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా వేదికపై చేసిన నృత్య ప్రదర్శన, పాటను ఆలపించిన విధానం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి అనుగుణంగా లేదని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. ఇప్పటికే పలు వివాదాలతో వార్తల్లో నిలిచిన మంగ్లీపై ఈ అంశం కూడా చర్చకు దారితీసింది.
తెలంగాణ ఉద్యమ చరిత్రకు సంబంధించిన పాటలను ప్రదర్శించే సమయంలో మరింత బాధ్యతతో వ్యవహరించాలని కొందరు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ వివాదంపై మంగ్లీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. సోషల్ మీడియాలో మాత్రం ఈ అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతుండగా, కొందరు ఆమెకు మద్దతు తెలుపుతుండగా మరికొందరు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

# జర్నలిస్టులకు ఇళ్లు.. ఆరోగ్యశ్రీకి నెలకు రూ.150 కోట్లు

మొదటిపేజీ తరువాయి

కోసం అధికార యంత్రాంగం పనిచేస్తోందని వెల్లడించారు.
ఖమ్మంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడిన భట్టి విక్రమార్క, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో 'రాజీవ్ ఆరోగ్య శ్రీ' కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ పథకం నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతి నెలా సుమారు రూ.150 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. పేద కుటుంబాలకు రూ.10 లక్షల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.
ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో అదనంగా 10 వేల పడకలను ఏర్పాటు చేస్తున్నట్లు భట్టి వెల్లడించారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.
రాష్ట్ర మంత్రివర్గం సమష్టిగా పనిచేస్తోందని, తెలంగాణ అభివృద్ధే అందరి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. ఇదే విశ్వాసం కొనసాగితే 2028 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గట్టి ప్రత్యర్థులు ఉండరని ధీమా వ్యక్తం చేశారు.
రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి స్పష్టం చేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు ఏర్పాటు చేసే ఆలోచన లేదని తెలిపారు. రైతుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గదన్నారు.
ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియపై కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించిన భట్టి, ఓటర్ల మ్యాపింగ్, అన్‌మ్యాపింగ్ అంశాలను మీడియా నిశితంగా గమనించాలని కోరారు. ప్రభుత్వం తీసుకురానున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రజలకు మరింత భరోసా కల్పిస్తుందని చెప్పారు.



ధాన్యం కొనుగోళ్ల అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించిన భట్టి విక్రమార్క, రైతుల ప్రయోజనాల విషయంలో బీజేపీ స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ నాయకులు రాజకీయ విమర్శలకు పరిమితం కాకుండా, కేంద్రం ద్వారా రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకునే దిశగా పనిచేయాలని సూచించారు.



## పుష్కర తెలంగాణ.. ముష్కరుల తెలంగాణగా మారింది: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 2, సిరి న్యూస్:

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకప్పుడు అభివృద్ధి, సంక్షేమానికి ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుతం సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటోందని అన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రను ప్రస్తావించిన కేటీఆర్, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన కృషిని గుర్తు చేశారు. ఉద్యమ కాలంలో ప్రజల్లో చైతన్యం నింపేందుకు కేసీఆర్ అనేక రూపాల్లో పోరాటం చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేక సవాళ్లను అధిగమించి సాధించిన విజయమని చెప్పారు.

రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన కేటీఆర్, "పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల తెలంగాణగా మారింది" అని వ్యాఖ్యానించారు. ప్రజల ఆశయాలతో ఏర్పడిన రాష్ట్రం అభివృద్ధి పథం నుంచి తప్పిపోతోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల కోసం కేసీఆర్ చేసిన సేవలను ఉద్దేశపూర్వకంగా మరుగునపరుస్తున్నారని అన్నారు.

నల్లగొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారం, తాగునీటి సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ కేసీఆర్ పాలనలో రాష్ట్రం సాధించిన పురోగతిని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు.

రాజకీయ పరిస్థితులపై స్పందించిన కేటీఆర్, గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేసి విజయాలు సాధించిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలతో అధికారంలోకి వచ్చినప్పటికీ వాటి అమలులో విఫలమవుతోందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, పరిపాలనా వ్యవస్థలు బలహీనపడుతున్నాయని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో వెనుకడుగు వేస్తోందని పేర్కొన్న కేటీఆర్, ప్రస్తుత పరిస్థితులు శాశ్వతం కాదన్నారు. 2028 ఎన్నికల్లో ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తారని, కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం అమలు

- **రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి అమల్లోకి నూతన చట్టం**
- **కోర్టు అనుమతి లేకుండా లాయర్ల అరెస్టులకు అవకాశం లేదు**
- **తప్పుడు కేసులు పెడితే జైలు, జరిమానా**
- **దాడులు, బెదిరింపులపై కఠిన శిక్షలు**
- **ప్రాణహాని ఉంటే పోలీసు భద్రత కల్పింపు**

హైదరాబాద్, జూన్ 3, సిరి న్యూస్:

న్యాయవాదుల భద్రత, వృత్తిపరమైన స్వేచ్ఛను పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన 'తెలంగాణ న్యాయవాదుల రక్షణ చట్టం-2026' రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు న్యాయశాఖ జీవో ఎంఎస్ నెం.41 ద్వారా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

న్యాయవాదులు తమ విధులను ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్వర్తించేందుకు ఈ చట్టాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. లాయర్లతో పాటు వారి కుటుంబ సభ్యుల భద్రతకు కూడా ఇందులో ప్రత్యేక నిబంధనలు కల్పించారు.

ఈ చట్టంలోని కీలక అంశం న్యాయవాదుల అరెస్టులకు సంబంధించినది. ఇకపై ఏ న్యాయవాదినైనా అరెస్టు చేయాలంటే సంబంధిత న్యాయస్థానం అనుమతి తప్పనిసరి. కోర్టు అనుమతి లేకుండా అరెస్టు చేసే అవకాశం ఉండదు. దీంతో అక్రమ అరెస్టులు, వేధింపులు, కక్షసాధింపు చర్యలకు అడ్డుకట్ట పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

న్యాయవాదులపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు నమోదు చేసిన వారిపై కూడా కఠిన చర్యలకు చట్టంలో అవకాశం కల్పించారు. అలాంటి కేసుల్లో మూడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.25 వేల వరకు జరిమానా విధించవచ్చు.

న్యాయవాదులు లేదా వారి కుటుంబ సభ్యులపై దాడులు, బెదిరింపులు, దుర్భాషలాడటం వంటి చర్యలను కూడా తీవ్రమైన నేరాలుగా పరిగణించనున్నారు. మొదటిసారి నేరం రుజువైతే ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేల వరకు జరిమానా విధించవచ్చు. అదే నేరం మళ్లీ చేస్తే ఒకటి నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది.న్యాయవాదులకు ప్రాణహాని ఉందని భావించిన సందర్భాల్లో ప్రభుత్వం తక్షణమే పోలీసు భద్రత కల్పించనుంది. అలాగే వారి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గతంలో న్యాయవాద దంపతులు వామన్‌రావు, నాగమణి హత్య ఘటన తర్వాత న్యాయవాదుల భద్రతపై విస్తృత చర్చ జరిగింది. బార్ కౌన్సిల్, న్యాయవాద సంఘాల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ చట్టాన్ని రూపొందించింది. శాసనసభలో ఏకగ్రీవంగా ఆమోదం పొందిన ఈ చట్టం ద్వారా న్యాయవాదుల భద్రతకు మరింత భరోసా లభించనుంది.

## 'పెద్ది' టికెట్ ధరల పెంపుకు గ్రీన్ సిగ్నల్

- **తెలంగాణ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**
- **సింగిల్ స్క్రీన్లలో రూ.100 వరకు అదనపు ధర**
- **మల్టీప్లెక్స్‌లలో రూ.125 వరకు పెంపునకు అనుమతి**
- **ప్రీమియర్ షోలకు ప్రత్యేక ధరలు**
- **10 రోజుల పాటు మాత్రమే అమలు**

హైదరాబాద్, జూన్ 3, సిరి న్యూస్:

రామ్ చరణ్ కథానాయకుడిగా, బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది' చిత్రానికి టికెట్ ధరల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ప్రస్తుతం అమలులో ఉన్న టికెట్ ధరలకు అదనంగా రూ.100 వరకు వసూలు చేసుకోవచ్చు. అలాగే మల్టీప్లెక్స్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై అదనంగా రూ.125 వరకు పెంచుకునే అవకాశం కల్పించారు.

సినిమా విడుదల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక ప్రీమియర్ షోలకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జూన్ 3 రాత్రి ప్రదర్శించే ప్రీమియర్ షోల టికెట్ ధరలను గరిష్టంగా రూ.600 వరకు నిర్ణయించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ ధరల పెంపు సినిమా విడుదలైన తేదీ నుంచి 10 రోజుల వరకు మాత్రమే అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అనంతరం టికెట్ ధరలు సాధారణ రేట్లకే పరిమితం కానున్నాయి.

భారీ అంచనాల మధ్య విడుదలకు సిద్ధమవుతున్న 'పెద్ది' చిత్రానికి ప్రభుత్వం ఇచ్చిన ఈ అనుమతి నిర్మాతలు, పంపిణీదారులకు ఊరటనివ్వనుంది.

# ఓటరు జాబితా ప్రక్షాళనకు వేగం

- **రాష్ట్రంలో 68.30 శాతం మ్యాపింగ్ పూర్తి**
- **ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలు**
- **రాజకీయ పార్టీలతో సమన్వయం పెంచాలని సూచన**
- **ఆన్‌లైన్ సేవలపై విస్తృత ప్రచారం చేయాలని ఈసీఐ సూచన**
- **హైదరాబాద్‌లో ఎన్నికల సంఘం సమీక్ష సమావేశం**

హైదరాబాద్, జూన్ 3, సిరి న్యూస్:



దేశవ్యాప్తంగా చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తెలంగాణలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో మూడో దశ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం అధికారులకు సూచించింది.

హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో భారత ఎన్నికల సంఘం సీనియర్ అధికారులు అవినాష్ కుమార్, సంజయ్ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న చర్యలను వివరించారు.

ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఇప్పటివరకు 68.30 శాతం మ్యాపింగ్ పూర్తయిందని సుదర్శన్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిబ్బంది నియామకం, సహాయ కేంద్రాల ఏర్పాటు, ప్రజలకు అవగాహన కల్పించే చర్యలపై వివరించారు.

ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం అధికారులు ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. రాజ్యాంగ నిబంధనలు, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, ఓటర్ల నమోదు నియమాలు 1960కు సంబంధించిన అంశాలను వివరించారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన, తుది జాబితా విడుదల వరకు అనుసరించాల్సిన విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. గణన ఫారాల నింపడంలో పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల సంఘం అధికారులు సూచించారు. అలాగే ఓటర్లు అధికారిక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించే అవకాశంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. 'బుక్ ఎ కాల్' సదుపాయం ద్వారా ఓటర్లకు సమాచారం చేరవేయాలని సూచించారు.

జిల్లా ఎన్నికల అధికారులు అన్ని రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని, బూత్ లెవల్ ఏజెంట్లను ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని ఎన్నికల సంఘం పేర్కొంది. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, సమగ్రంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి ఎం. సత్యవాణి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, మేడ్చల్ కలెక్టర్ ఎం. మనూ చౌదరి తదితర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు లేవనెత్తిన సాంకేతిక, పరిపాలనా అంశాలపై ఎన్నికల సంఘం అధికారులు వివరణలు ఇచ్చారు.

## ఈ-వేలంతో రూ.202 కోట్ల ఆదా

మొదటిపేజీ తరువాయి

ద్వారా మెరుగైన ధరలు లభించాయని వెల్లడించారు. యాసంగి పంటల కొనుగోళ్లు కొనసాగుతున్న నేపథ్యంలో గోదాముల్లో నిల్వ ఉన్న ఖరీఫ్ మొక్కజొన్నను నెల రోజుల్లో పూర్తిగా తరలించాలని ప్రభుత్వం హెచ్1 బిడ్డర్లకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీంతో సుమారు 3.80 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులోకి వచ్చి, కొత్తగా కొనుగోలు చేస్తున్న పంటల నిల్వకు ఉపయోగపడుతుందని చెప్పారు.గతంలో గోదాముల వారీగా ఈటెండర్లు నిర్వహించే విధానం అమల్లో ఉండేదని మంత్రి తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన టెండర్లలో ఆశించిన ధరలు రాకపోవడంతో వాటిని ఆమోదించలేదన్నారు. రైతుల ప్రయోజనాలు, ప్రభుత్వ ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త ఈవేలం విధానాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు.దేశవ్యాప్తంగా మరింత మంది వ్యాపారులు పాల్గొనేలా రూపొందించిన ఈ విధానానికి మంచి స్పందన లభించిందన్నారు. మే 29న నిర్వహించిన ఈవేలంలో తీవ్ర పోటీ నెలకొనడంతో మెట్రిక్ టన్నుకు సగటున రూ.19,337 ధర లభించిందని తెలిపారు. ఇది గత టెండర్లతో పోలిస్తే టన్నుకు రూ.5,327 అధికమని చెప్పారు.రైతులు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోళ్లు చేపడుతోందని తుమ్మల పేర్కొన్నారు. కొనుగోలు, రవాణా, నిల్వ, నిర్వహణ ఖర్చులను భరిస్తూనే రైతులకు మద్దతుగా నిలుస్తోందన్నారు.ఇదే సందర్భంగా మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామక ప్రక్రియపై కూడా మంత్రి వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీకి కొత్త పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.ఎనుమాముల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎర్ర ప్రియాంక, వైస్ చైర్‌పర్సన్‌గా బండి జనార్ధన్‌ను నియమించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 191 మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించామని వెల్లడించారు. రైతులకు మెరుగైన సేవలు అందించడం, మార్కెట్ యార్డుల్లో పారదర్శకత పెంచడం, వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## సంగారెడ్డిలో అంతర్రాష్ట్ర డ్రగ్స్ తయారీ కేంద్రం బట్టబయలు

సంగారెడ్డి, జూన్ 3, సిరి న్యూస్:

సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అంతర్రాష్ట్ర డ్రగ్స్ తయారీ కేంద్రాన్ని మహారాష్ట్ర పోలీసులు ఛేదించారు. మండల పరిధిలోని పీచేర్యాగడి తండాలో ఉన్న రెండు ఫామ్‌హౌస్‌లలో అక్రమంగా డ్రగ్స్ తయారీ జరుగుతున్నట్లు గుర్తించి ప్రత్యేక బృందం దాడులు నిర్వహించింది. పక్కా సమాచారంతో ముంబై నుంచి వచ్చిన పోలీసు బృందం ఫామ్‌హౌస్‌లపై మెరుపు దాడి చేయగా, అక్కడ ల్యాబ్ తరహా ఏర్పాట్లు చేసి డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు బయటపడింది. తనిఖీల సందర్భంగా సుమారు మూడు కిలోల మెఫెడ్రోన్ డ్రగ్స్‌తో పాటు, వాటి తయారీకి ఉపయోగించే భారీ మొత్తంలో ముడి పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ముడి పదార్థాల విలువ సుమారు రూ.6.5 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాథమిక విచారణలో డ్రగ్స్ తయారీకి అవసరమైన రసాయనాలను ముంబై నుంచి రహస్యంగా తరలించినట్లు తేలింది. నగర ప్రాంతాల్లో నిఘా ఎక్కువగా ఉండటంతో నిందితులు సంగారెడ్డి గ్రామీణ ప్రాంతంలోని ఫామ్‌హౌస్‌ను కేంద్రంగా ఎంచుకుని అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇక్కడ తయారు చేసిన డ్రగ్స్‌ను ముంబైతో పాటు ఇతర ప్రధాన నగరాలకు సరఫరా చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు.

# లబ్ధిదారుల కల సాకారం



- **గృహప్రవేశాల్లో పాల్గొన్న మంత్రి**
- **ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ**
- **వరంగల్ అభివృద్ధికి కట్టుబాటు**

హనుమకొండ, జూన్ 2, సిరి న్యూస్



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లాలో పేదల గృహ కలలను సాకారం చేసే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శాయంపేటలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొని వారికి ఆత్మీయ కానుకలు అందజేశారు.

గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయిన సుమారు 608 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను ప్రజా ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు వెచ్చించి మరమ్మతులు చేపట్టి నివాసయోగ్యంగా మార్చిందని మంత్రి తెలిపారు. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరిందన్నారు. అనంతరం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పదేళ్ల పాలనలో పేదల సమస్యలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఇళ్లు రాని వారు ఎవరూ అధైర్యపడవద్దని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో హైదరాబాద్ తరహాలో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ భూములను గుర్తించి పెద్ద ఎత్తున గృహ నిర్మాణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## తెలంగాణ బాగుపడాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి: బండి సంజయ్

హైదరాబాద్, జూన్ 3, సిరి న్యూస్:



కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ లబ్ధి కోసమేనని ఆరోపించారు. అవసరమైతే తాను, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కలిసి మహారాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశానికి సమన్వయం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న బండి సంజయ్, అనంతరం ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటికీ ఉద్యమ ఆశయాలు పూర్తిస్థాయిలో నెరవేరలేదని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశించిన స్థాయిలో లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన బండి సంజయ్, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం గందరగోళం, అవినీతి, కమిషన్ల పాలన కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తిగా ఉన్నారని చెప్పారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో బీజేపీ కీలక పాత్ర పోషించిందని బండి సంజయ్ పేర్కొన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లుకు తమ పార్టీ మద్దతు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు.

ధాన్యం కొనుగోళ్ల అంశంలో కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. రాష్ట్రం పంపిన నివేదికల ఆధారంగానే కేంద్రం ధాన్యం సేకరణ చేపడుతోందని తెలిపారు. రైతుల ప్రయోజనాల విషయంలో కేంద్రం ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర నిధులు కీలకమని పేర్కొన్న బండి సంజయ్, రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మరింత పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్రానికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అవసరమని, అదే తెలంగాణ పురోగతికి దోహదపడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జోగిపేట పోలీసులకు తెలంగాణ సేవా పథకం అవార్డులు





- **పథకం కింద ఒక్కొక్కరికి రూ.20వేల నగదు**

**జోగిపేట, మే 02, (సిరి న్యూస్):**

పోలీసుశాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తూ విశిష్ట సేవలు అందించిన పోలీసు సిబ్బందికి రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా అవార్డులను రాష్ట్ర స్థాయిలో ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా నుంచి తెలంగాణ సేవా పథకం కింద నలుగురు పోలీసు అధికారులను ఎంపిక చేయగా అందులో జోగిపేటకు చెందిన ఎస్ఐ–2 బి.దుర్గయ్య, హెడ్‌కానిస్టేబుల్ బి. వేణుగోపాల్‌రావులను ఎంపిక చేసారు. వీరికి ఆగస్టు మాసంలో సేవాపథకం కింద నగదును అందజేయనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. వీరికి ఈ పథకం కింద ఒక్కొక్కరికి రూ.20వేల నగదును అందజేయనున్నారు. 1990లో ఎస్ఐ దుర్గయ్య, 32 ఏళ్ల క్రితం బి.వేణుగోపాల్‌రావులు పోలీస్ కానిస్టేబుల్‌లో వివిధ స్థాయిల్లో సేవలను అందించారు. వారి సేవలను గుర్తించి సేవాపథకం కింద ఎంపిక చేసారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన జాబితాలో తమ పేర్లు ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని దుర్గయ్య, వేణుగోపాల్‌రావులు అన్నారు. వీరిని జోగిపేట పోలీసు సిబ్బంది అభినందించారు.

# శివంపేట మండలంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు!!



**శివంపేట జూన్ 2 ( సిరి న్యూస్ )**

శివంపేట మండలంలోని వివిధ గ్రామాలలో తెలంగాణ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయ వద్ద సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఎగరవేశారు. ఎమ్మార్వో కార్యాలయం వద్ద ఎమ్మార్వో కమలాద్రి చారి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, మండల వనరుల కేంద్రం వద్ద ఎంఈఓ బుచ్చా బుచ్చ నాయక్, శాఖ గ్రంధాలయం వద్ద గ్రంథ పాలకురాలు అర్చన, ఇతర ప్రభుత్వ కార్యాలయం వద్ద సంబంధిత అధికారులు జాతీయ జెండాను ఎగరవేశారు. శివంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్, ఉప సర్పంచ్ ఇసుగారి మల్లేశం, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామ కార్యదర్శి రమాదేవి సమక్షంలో జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ రాజి పేట వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఎంతోమంది అమరవీరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం కల సహకారమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో శివంపేట గ్రామపంచాయతీ యువకులు, డ్వాక్రా మహిళా మణులు, తదితరులు 12వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

# పీఏసీఎస్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

- **జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి**

**కొండాపూర్, జూన్ 2(సిరిన్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు జరిగాయని, రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ అమరవీరులను స్మరించుకుని వారికి ఘన నివాళులు అర్పించారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత అన్ని రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించిందమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, రైతులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. వేడుకలు ఉత్సాహభరితంగా సాగగా, పాల్గొన్న వారందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్యక్రమాన్ని ముగించారు.



## సంపాదకీయం

# పవన్ వ్యూహాత్మక అడుగులా? వివాదాల సుడిగుండమా?



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ పర్యటన, హైదరాబాద్‌లో ఆయన తలపెట్టిన "నవ నిర్మాణ సభ" చుట్టూ ముసురుకున్న రాజకీయ వివాదాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం (జూన్ 2) సందర్భంగా హైదరాబాద్‌లో ఈ సభ నిర్వహించి, తద్వారా రాష్ట్రంలో జనసేన పార్టీ విస్తరణకు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కేడర్‌ను సమాయత్తం చేయాలని పవన్ వ్యూహం రచించారు. అయితే, శాంతిభద్రతల కారణాలు, ట్రాఫిక్ సమస్యలను చూపుతూ పోలీసులు ఈ సభకు అనుమతి నిరాకరించడం, దీనిపై జనసేన దాఖలు చేసిన అత్యవసర హౌస్ మోషన్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు తిరస్కరించడం విశేషం. రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి తెలంగాణ రాజకీయ క్షేత్రంలో హాట్ టాపిక్‌గా మారారు.

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ విజయకేతనంలో కీలక పాత్ర పోషించిన అనంతరం ఆయన దృష్టి ఇప్పుడు సహజంగానే తెలంగాణ వైపు మళ్లింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సాక్షిగా హైదరాబాద్‌లో సభ పెట్టి పార్టీ కేడర్‌లో జోష్ నింపాలని ఆయన భావించినప్పటికీ, అది కాస్తా తీవ్ర రాజకీయ ఉద్రిక్తతలకు, వివాదాలకు దారితీయడం తెలుగు రాజకీయాల సంక్లిష్టతను ప్రతిబింబిస్తోంది.

**వివాదానికి మూలం...**

ప్రాంతీయ సెంటిమెంట్ల సెగ పవన్ కళ్యాణ్ ఇటీవల కోనసీమ పర్యటనలో చేసిన కొన్ని వ్యాఖ్యలు—"తెలంగాణ నాయకులు కోనసీమ పచ్చదనాన్ని చూసి దిష్టి పెట్టారు" అనే అర్థంలో సాగిన ప్రకటన. ఈ వివాదానికి ప్రధాన కారణమైంది. దీనికి తోడు ప్రముఖ విశ్లేషకులతో జరిగిన అంతర్గత పరోక్ష యుద్ధం, జర్నలిస్టుల నిరసనలు వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి. పవన్ వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉన్నాయని అధికార కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ శక్తులు తీవ్రంగా మండిపడ్డాయి. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే పవన్ ఇక్కడ సభ పెట్టుకోవాలని రాష్ట్ర మంత్రులు డిమాండ్ చేయడం, గన్ పార్క్ వద్ద ఇరు పార్టీల కార్యకర్తలు ఘర్షణకు దిగడం చూస్తే ప్రాంతీయ సెంటిమెంట్లు ఎంత త్వరగా రాజుకుంటాయో మరోసారి రుజువైంది. గచ్చిబౌలి పరిధిలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలతో పాటు శాంతిభద్రతల ముప్పు ఉందంటూ సైబరాబాద్ పోలీసులు జనసేన సభకు అనుమతి నిరాకరించారు. హైకోర్టు కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోకపోవడంతో జనసేనకు చట్టపరంగా నిరాశే ఎదురైంది. అయితే, దీని వెనుక కేవలం శాంతిభద్రతల కారణాలే ఉన్నాయా లేక ఆంధ్రప్రదేశ్ నాయకులు తెలంగాణలో రాజకీయంగా బలపడకుండా అడ్డుకునే వ్యూహం ఉందా అనే చర్చ నడుస్తోంది. "అనవసరమైన ఆంక్షలతో సభను అడ్డుకున్నారు" అని జనసేన ఆరోపిస్తుండగా, "తెలంగాణలో శాంతియుత వాతావరణాన్ని పాడుచేసేందుకే పవన్ ప్రయత్నిస్తున్నారు" అని కాంగ్రెస్ ప్రత్యారోపణలు చేస్తోంది.

**జనసేన విస్తరణ కాంక్ష...**

క్షేత్రస్థాయి వాస్తవాలు పవన్ కళ్యాణ్ పేర్కొన్నట్లు "జనసేనకు ఊపిరి పోసింది తెలంగాణ గడ్డనే". కానీ ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సామాజిక వర్గ సమీకరణాలు, గట్టి ఓటు బ్యాంకు తెలంగాణలో జనసేనకు అంతగా లేవు. ఇక్కడ పవన్‌కు భారీగా అభిమాన గణం ఉన్నప్పటికీ, వారు ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలలో చీలిపోయి ఉన్నారు. గతంలో టీడీపీ, వైసీపీ వంటి ఏపీ ప్రధాన పార్టీలు తెలంగాణలో తమ పట్టును కోల్పోయి, ఆంధ్ర పార్టీలుగా ముద్రపడటంతో ఇక్కడ కార్యకలాపాలు తగ్గించుకున్నాయి. ఇటువంటి తరుణంలో, గ్రేటర్ హైదరాబాద్, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని జనసేనను ఇక్కడ బలోపేతం చేయాలనుకోవడం పవన్‌కు ఒక పెద్ద సవాలే. పవన్ కళ్యాణ్ తాను తెలంగాణకు వ్యతిరేకం కాదని, కేవలం ప్రేమ, గౌరవం మాత్రమే ఉన్నాయని కొండగట్టు అంజన్న సాక్షిగా స్పష్టం చేసినప్పటికీ, రాజకీయ ప్రత్యర్థులు దీన్ని అంత తేలిగ్గా వదిలేలా లేరు. ఒక పక్క ఏపీలో డిప్యూటీ సీఎంగా అధికార బాధ్యతలు నిర్వహిస్తూనే, పొరుగు రాష్ట్రంలో పార్టీ ఉనికిని చాటుకోవడం అంత సులువు కాదు. ఈ పర్యటన వివాదాలు, సభల రద్దుతో ప్రారంభమైనప్పటికీ, తెలంగాణ రాజకీయాల్లో జనసేన ప్రయాణం సాగాలంటే కేవలం సినిమా ఇమేజ్ లేదా భావోద్వేగ ప్రకటనలు సరిపోవు. ఇక్కడి నేల స్వభావాన్ని, ప్రజల సెంటిమెంట్లను గౌరవిస్తూ, స్థానిక సమస్యలపై స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్ళినప్పుడే పవన్ వ్యూహాలు ఫలించగలవు. అయితే తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందని, తెలంగాణ మొత్తం తాను తిరుగుతానని మాత్రం స్పష్టం చేసి ప్రత్యర్థి పార్టీలకు సమాధానం ఇచ్చారు.

# గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలి.


- **అంగరంగ వైభవంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు.**
- **అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు , గుడిసెలు లేని మెదక్ జిల్లా గా తీర్చిదిద్దాలి.**
- **జిల్లా సమైక్య సభ్యులకు 102 కోట్ల 35 లక్షల జంబో చెక్కు ను పంపిణీ చేసిన మంత్రి.**
- **తెలంగాణ అమరవీరులకు ఘనమైన నివాళులు.**
- **తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు రాష్ట్ర కార్మిక ఉపాధి,శిక్షణ, పరిశ్రమలు, గనుల భూగర్భ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి వెంకట స్వామి.**

**మెదక్ జూన్,02(సిరిన్యూస్)**





మెదక్ జిల్లాను గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభసందర్భంగా రాష్ట్ర కార్మిక ఉపాధి,శిక్షణ, పరిశ్రమలు,గనుల భూగర్భ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి వెంకట స్వామి అన్నారు.జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ లో నిర్వహించిన వేడుకలకు మంత్రి హాజరై తెలంగాణ సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల పోరాట స్ఫూర్తి ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని పేర్కొంటూ అమరవీరులకు ఘనమైన నివాళులు అర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాలాపన చేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షల మేరకు ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, ఆర్థిక పురోగతి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీ తనంతో కూడిన పాలన అందిస్తూ ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఐక్యత, సౌభ్రాతృత్వంతో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు.జిల్లా మహిళా సంఘాలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమైక్య సభ్యులకు 102 కోట్ల 35 లక్షల జంబో చెక్కు ను మంత్రి మహిళలకు అందించారు .శంకరం పేట (ఆర్) మండలం గవ్వలపల్లి గ్రామానికి చెందిన వారికి 5 మంది లబ్ధి దారులకు ఇందిరమ్మ ఇండ్ల రెండవ విడత మంజూరి పత్రాలు అందించారు. గుడిసెలు లేని మెదక్ జిల్లా గా తీర్చిదిద్దాలన్నారు.విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. సంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను మంత్రి అభినందించి , మెమెంటో లు అందజేశారు.వివిధ శాఖల ద్వారా ఏర్పాటుచేసిన స్టాల్స్ ను మంత్రి సందర్శించి సుదీర్ఘంగా పరిశీలించారు.అనంతరం ఈ సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పి శ్రీనివాస్ రావు, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ ,మున్సిపాలిటీ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,గ్రంధాలయాల చైర్మన్ సుహాసిని రెడ్డి, ఆర్డీవో రమాదేవి, ప్రజా ప్రతినిధులు, స్వతంత్ర సమరయోధులు, తెలంగాణ అమర వీరుల కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అమరవీరుల ఆశయాలే రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకం

- **మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్**

**గుమ్మడిదల, జూన్ 2( సిరి న్యూస్):**



తెలంగాణ ప్రజల ఆశయ సాధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గుమ్మడిదల మున్సిపాలిటీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంతో జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాలాపన నిర్వహించి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశయ సాధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమర వీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యా, కమిషనర్ దశరథ్, వార్డు కౌన్సిలర్లు మాధవి, పద్మ, ప్రమీల, రమేష్, నరేందర్ రెడ్డి, నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, ఉద్యమకారుడు మంద భాస్కర్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాధనలో పోరాడిన ఉద్యమకారులను గుర్తించాలి

- అమరవీరులకు ఘన నివాళులు
- ఉద్యమకారులకు న్యాయం చేయాలని డిమాండ్

**గుమ్మడిదల (దోమడుగు), జూన్ 2 (సిరి న్యూస్):**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామంలో తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు అమర వీరుల స్థూపం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్మారక స్థూపం వద్ద రెండు నిమిషాల పాటు మౌనం పాటించి వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల ఐక్యవేదిక కన్వీనర్ మంద భాస్కర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి తగిన గౌరవం కల్పించాలని కోరారు. రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారి సేవలకు సరైన గుర్తింపు ఇప్పటికీ లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. గౌరవ వేతనం, కుటుంబాలకు ఆరోగ్య కార్డులు, వారి పిల్లలకు ఉన్నత విద్య, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. తెలంగాణ సాధనలో పాల్గొన్న వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు ప్రతి సంవత్సరం జూన్ 2న రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సన్మానించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వాలు ఉద్యమకారుల సమస్యలను నిర్లక్ష్యం చేశాయని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు




చేయడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. ఆ కమిటీ నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారి సమ స్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ గౌడ్, విజయరామకృష్ణ, ఆంజనేయులు, కుమ్మరి వెంకటేష్, ఎస్.కె. గరీబ్ బాయ్, దర్గా శ్రీనివాస్, జీవన్ కుమార్, కె. రామకృష్ణ గౌడ్, మంగయ్య, చింతల రాజు, కాళేశ్వర్, గోపాల్, స్వేచ్ఛ రెడ్డి, వీరారెడ్డి, మహిపాల్, ఎస్.కె. రఫీక్, బుజేందర్, మోహన్ రెడ్డి, బి. జంగారెడ్డి తదితరులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.

# త్యాగాల చరిత్రకు న్యాయం జరిగిన రోజు....

- అవమానాల అధ్యాయానికి ముగింపు పలికిన రోజు ..
- అంగరంగ వైభవంగా జరిగిన అవతరణ దినోత్సవ వేడుకలు

**కొల్చారం, జూన్ 2,(సిరి న్యూస్)**



త్యాగాల చరిత్రకు న్యాయం జరిగిన రోజు.. అవమానాల అధ్యాయానికి ముగింపు పలికిన రోజు.. స్వాతంత్రం పొందిన దేశంలోనే పిడికెడు ఆత్మగౌరవం కోసం, కసికేడు నీళ్ల కోసం కొన్ని ఉద్యోగాల కోసం, మళ్లీ స్వాతంత్ర్య సమరమే చేసిన నేల తెలంగాణ అడుగడుగునా అవమానాలను భరించి అన్నచివేతల కింద నలిగి, అణగదొక్కబడి, ఆస్తిత్వం కోసం తపించి, అగ్నిజ్వాలలై రగిలి, అగ్నిపర్వతం లాంటి ఉద్యమాన్ని సృష్టించిన నేల తెలంగాణ, ఆ ఉద్యమ గర్భము నుంచి పురుడు పోసుకున్న ప్రజారాజ్యం తెలంగాణ, త్యాగాల రక్తంతో పుట్టిన నేల తెలంగాణ ఆత్మగౌరవ పతాకంగా ఎగిసిన నేల తెలంగాణ బిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు రాంపల్లి గౌడి శంకర్ గుప్తా, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు రవితేజ రెడ్డి లు అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా మండల కేంద్రమైన కొల్చారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ సంక్షేమం కోసం పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సకాలంలో ఎరువులు సరఫరా చేయలేక, రుణమాఫీ చేయలేక రైతు బరోసా డబ్బులు ఇవ్వలేక ధాన్యం కొనుగోలు చేయలేక ప్రభుత్వం రైతులను తీవ్రంగా మోసం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పనితీరు మార్చుకోకపోతే బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షంగా ఉద్యమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు మోహన్, స్వర్ణలత విజయ్, కొల్చారం ఉప సర్పంచ్ గోపిరాణి, రంగంపేట సహకార సంఘం ఉపాధ్యక్షులు మోత్కు మల్లేశం, జిల్లా నాయకులు ముత్యం గారి సంతోష్, రాజా గౌడ్ చిట్యాల యాదయ్య, నంగునూరు గౌరీ శంకర్ , సాయిని సిద్ధి రాములు, వనమాల శ్రీధర్ సుధాకర్ రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# రవాణా రంగంలోకి మహిళామణులు

- మహిళలు రవాణా రంగంలో ప్రవేశించడం వల్ల మహిళా సాధికారత పెరుగుతుంది
- ఎలక్ట్రిక్ ఆటో పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్
- ఆటో డ్రైవర్ గా అదనపు కలెక్టర్ నగేష్, ఆటోలో ప్రయాణించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్,
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జూన్,02(సిరిన్యూస్)**

అజివిక గ్రామీణ ఎక్స్ ప్రెస్ యోజన పథకం కింద 3,35,000 రూపాయల ధర కల్గిన మహేంద్ర ఎలక్ట్రిక్ ఆటోను మక్తా భూపతిపూర్ గ్రామానికి చెందిన కే.సంధ్య రాణికి మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంధ్య రాణి గత రెండు సం: క్రితం గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యాలయంలో ఉపాధి నిమిత్తం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు పరిశీలిన అనంతరం సంధ్య రాణినీ అర్హులు గా గుర్తించి ఆటో ను మంజూరు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ఈ పథకం ద్వారా వెనుకబడిన ప్రాంతాలలో నివసించే ప్రజలకు సురక్షితమైన రవాణా అందుబాటులోకి వస్తుందనీ, మహిళలు రవాణా రంగంలోకి ప్రవేశించడం వల్ల మహిళా సాధికారత పెరుగుతుందనీ అన్నారు. ఆజీవిక గ్రామీణ ఎక్స్ప్రెస్ యోజన (AGEY) అనేది ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఒక ప్రత్యేకమైన పథకం అని గ్రామీణ ప్రాంతాలలో నివసించే స్వయం సహాయక సంఘాల (SHG) మహిళలకు రవాణా సేవలను నడుపుకునే అవకాశం కల్పించడం ద్వారా, వారికి అదనపు ఆదాయాన్ని మరియు ఉపాధిని అందించడం దీని ముఖ్య ఉద్దేశం అని అన్నారు.మహిళలు సొంతంగా ఆర్థికంగా ఎదగాలన్నారు. మక్తా భూపతిపూర్ లో రవాణాకు సమస్య ఉందని ,ఎలాంటి సౌకర్యం లేదని తన దృష్టికి వచ్చిన వెంబడే ఎలక్ట్రిక్ ఆటో



మంజూరు చేశామన్నారు.ఆటో డ్రైవర్ గా మారి అదనపు కలెక్టర్ నగేష్ ఆటో నడిపారు.ఆటోలో ప్రయాణికులు గా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రయాణించారు. ఈ సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ రావు,అదనపు గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సరస్వతి,డి పి యం యాదయ్య, ఏ పి యం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

**తూప్రాన్ జూన్ 2 సిరి న్యూస్**

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రజని రవీందర్ గౌడ్ మున్సిపల్ కమిషనర్ కె.రమేష్ కుమార్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొక్కొండ సమతా కాశిరెడ్డి పాలకవర్గ సభ్యులు, తూప్రాన్ పట్టణ తెలంగాణ ఉద్యమ కారులు, తూప్రాన్ పట్టణ ప్రముఖులు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు



# వివాహ వార్షికోత్సవం ఘనంగా




**మునిపల్లి, జూన్ 2 (సిరి న్యూస్):**

మునిపల్లి మండలంలోని కంకోల్ గ్రామ సమీపంలోని ముకుదంపల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో వేంపల్లి శివలీల నాగిశెట్టి దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.అనంతరం మునిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రసూల్ పటేల్ దంపతులను శాలువాలతో సన్మానించి, కేక్ కట్ చేయించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం పల్లి వీర్ శెట్టి, షఫీ, మల్లప్ప, చాంద్ పాషా, ఈశ్వరయ్య, వీరన్న, ఫెరోజ్, ఇలియాస్, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఉద్యమ త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ

జీఎంఆర్



**రామచంద్రపురం,(పటాన్‌చెరు), జూన్ 2 (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరులో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి సమీపంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఘన నివాళులర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 14 ఏళ్ల మలిదశ ఉద్యమంలో జరిగిన త్యాగాల ఫలితంగానే నేటి తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని పేర్కొన్నారు. నాలుగు కోట్ల ప్రజల ఆత్మగౌరవ ఆకాంక్షలు నెరవేరిన చారిత్రక రోజుగా రాష్ట్ర ఆవిర్భావాన్ని అభివర్ణించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని ఆయన తెలిపారు.రాష్ట్ర అవతరణ అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు, బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## అంగరంగ వైభవంగా తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

**కొల్చారం, జూన్ 2,(సిరి న్యూస్)**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం మండలంలోని వివిధ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కొల్చారం తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ శ్రీనివాసాచారి, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా బేగం, మండల వ్యవసాయ అధికారి కార్యాలయం వద్ద వ్యవసాయ అధికారి శ్వేత కుమారి, పోలీస్ స్టేషన్లో ఎస్సై మహమ్మద్ మహినుద్దీన్, గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ దేవన్న గారి శేఖర్, రంగంపేటలో ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి, సహకార సంఘం వద్ద ఉపాధ్యక్షులు మోత్కు మల్లేశం, గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అరిగే స్వర్ణలత విజయ్ లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో మండల ప్రజలు ప్రభుత్వ ఉద్యోగులు, యువజన సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

**పాపన్నపేట్ జూన్ 2 (సిరి న్యూస్) :**



పాపన్నపేట మండలంలోని కుర్తివాడ గ్రామ శివారులో మంజీరా నది నుంచి సోమవారం అర్ధరాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి వెళ్లి పరిశీలించారు.ఇసుక లోడ్ తో ఉన్న రెండు ట్రాక్టర్లు, ఇసుక తరలించేందుకు ప్రయత్నించిన మరో తొమ్మిది ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ట్రాక్టర్లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.మండలంలో మంజీరా నది, చెరువుల నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎక్కడైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## తూప్రాన్ ఐ ఓ సీ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భవ వేడుకలు



**తూప్రాన్ జూన్ 2 సిరి న్యూస్**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం తూప్రాన్ లోని ఐ ఓ సి కార్యాలయంలో ఘనంగా జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు ఆర్ డీ ఓ జయ చంద్రా రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్ డీ ఓ జయ చంద్రా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాన్ని, ఆ ఉద్యమంలో విద్యార్థులు, యువత, ప్రజలు చేసిన త్యాగాలు తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేని త్యాగాలని గుర్తు చేస్తూ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నెరవేరడానికి ఎన్నో ఏళ్ల పాటు జరిగిన పోరాటం, అమరుల త్యాగాల చరిత్రను నిలిపిన మన తెలంగాణ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటినుండి వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారుఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ జయ చంద్రారెడ్డి. తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఐ ఓ సి కార్యాలయం అధికారులు సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షల రూపం

**ప్రగతి పథంలో తెలంగాణ**
**అమరుల త్యాగాల పునాదిపై**
**స్వయం పాలన వైభవంలో తెలంగాణ రాష్ట్రం**
**గత వైభవాల స్మరణ భావితరాల ప్రగతి బాట**
**తెలంగాణ ఆవిర్భావ వేడుకలు**



**అమీన్ పూర్ జూన్ 2 సిరి న్యూస్**

అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని శిల్పా కాలనీలో వినోద్,కొత్తపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాల నిరీక్షణ అన్యాయాలపై తెలంగాణ అస్తిత్వం మరియు ఆత్మగౌరవం కోసం నాలుగు కోట్ల ప్రజలు చేసిన సుదీర్ఘ పోరాట ఫలితమే ఈ రాష్ట్రం అని అన్నారు. అమరుల త్యాగాలు తొలిదశ ఉద్యమం నుండి 2014 మలిదశ ఉద్యమం కొరకు ప్రాణాలు అర్పించిన అమరుల త్యాగాలను స్మరించుకునే రోజుది అని తెలిపారు.శాంతియుత పోరాటం విద్యార్థులు మేధావులు కవులు కళాకారులు మరియు సకల జనులు ఏకమై ప్రజాస్వామ్య పద్ధతిలో సాధించుకున్న అద్భుత విజయం తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. జల వనరుల స్వయం సమృద్ధి తెలంగాణకు దక్కాల్సిన సాగునీరు తాగునీరు వాటాను సాధించుకుని ఎండబెట్టిన నేలను పచ్చని పసిడి పొలాలుగా మార్చుకున్నామని తెలిపారు. సాంస్కృతికి పెద్దపీట బతుకమ్మ బోనాలు మరియు సమ్మక్క సారలమ్మ జాతర వంటి తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అధికారిక గుర్తింపు లభించింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహేష్, వేణు, విద్యాసాగర్, శ్రీకాంత్, ముఖేష్, రమేష్ ,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం..

**గీతంలో వేసవి క్రీడా శిబిరానికి విశేష స్పందన**
**ఆరోగ్యకర జీవనశైలికి ప్రోత్సాహం**



**రామచంద్రపురం,(పటాన్చెరు), జూన్ 2 (సిరి న్యూస్):**

పిల్లల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో వేసవి క్రీడా శిబిరాన్ని నిర్వహిస్తోంది. క్యాంపస్ లైఫ్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి అధ్యాపకులు, సిబ్బంది కుటుంబాల నుంచి విశేష స్పందన లభిస్తోంది.ఆరు నుంచి 15 సంవత్సరాల వయస్సు గల చిన్నారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ శిబిరంలో టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి క్రీడల్లో శిక్షణ అందిస్తున్నారు. అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో పిల్లలు ఆసక్తిగా పాల్గొంటూ తమ ప్రతిభను మెరుగుపరుచుకుంటున్నారు.నేటి డిజిటల్ యుగంలో పిల్లలను శారీరక వ్యాయామం, క్రీడల వైపు మళ్లించడం అత్యంత అవసరమని గీతం యాజమాన్యం పేర్కొంది. ఈ క్రమంలో పిల్లల్లో ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించడంతో పాటు జట్టు భావన, ఆత్మవిశ్వాసం, పట్టుదల వంటి విలువలను పెంచేందుకు ఈ శిబిరం దోహదపడుతోందని తెలిపింది.క్యాంపస్ లైఫ్ డైరెక్టరేట్ అధికారులు మాట్లాడుతూ, క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి కూడా ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పిల్లలకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే అవకాశాన్ని కల్పించడంతో పాటు చురుకైన జీవనశైలిని అలవర్చే లక్ష్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఉద్యోగులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ గీతం హైదరాబాద్ చేపడుతున్న వినూత్న కార్యక్రమాల్లో ఈ వేసవి క్రీడా శిబిరం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

## రామచంద్రపురంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



**రామచంద్రపురం, జూన్ 2 (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని రామచంద్రపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం, జీహెచ్ఎంసీ వార్డ్ కార్యాలయం, గీత భూపాల్ రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని స్మరించుకుంటూ అమరవీరులకు నివాళులర్పించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సరస్వతి, అమీన్‌పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్, పటాన్‌చెరు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు సింధూ, పుష్ప, తొంట అంజయ్య, డిప్యూటీ తహశీల్దార్ రవి, నాయకులు నగేష్ యాదవ్, కుమార్ గౌడ్, ఖదీర్, సర్వేయర్ రాంబాద్రా తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగాలతోనే తెలంగాణ సాధ్యం..

- **తెలంగాణ ప్రగతి వెనుక కేసీఆర్ దూరదృష్టి..**
- **తొలి పదేళ్ల తెలంగాణ దేశానికే ఆదర్శం..**
- **మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి..**

**మెదక్ జూన్,02(సిరిన్యూస్)**



తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాలు, విద్యార్థులు, ఉద్యోగులు, సబ్బండ వర్గాల సమష్టి పోరాట ఫలితంగానే ఆవిర్భవించిందని,కేసీఆర్ దూరదృష్టి, సుపరిపాలనతో తొలి పదేళ్ల తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణంలో మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ లు,పార్టీ శ్రేణులతో కలిసి పద్మ దేవేందర్ రెడ్డి ప్రొఫెసర్ జయశంకర్ సార్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.పార్టీ జెండాను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత మాజీ సీఎం కెసిఆర్ గారి ఆదేశాల మేరకు నాయకులతో కలిసి ఈ విపత్కర పరిస్థితుల్లో తెలంగాణ ఆస్తిత్వ రక్షణే నా ప్రథమ కర్తవంగా భావిస్తూ మరో ప్రజా పోరాటానికి పునరంకితం చేసుకుంటామని కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ వ్యతిరేకుల కుట్రలను చేదిద్దాం- మన తెలంగాణను రక్షించుకుందాం అనే నినాదంతో నిరంతరం ఉద్యమిస్తామని మనసా,వాచా,కర్మణా ప్రతిజ్ఞ చేయించారు. అ న ంత ర ం మాట్లాడుతూ..14 ఏళ్ల అలుపెరగని ఉద్యమం, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని పేర్కొన్నారు. అమరుల త్యాగాలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, సబ్బండ వర్గాల సమష్టి పోరాట ఫలితంగానే ఆరు దశాబ్దాల కల సాకారమైందని గుర్తు చేశారు.తెలంగాణ తొలి పదేళ్ల ప్రస్థానం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా మారాయని తెలిపారు. దేశంలో అతి పిన్న వయస్సున్న రాష్ట్రంగా తెలంగాణ అనేక రంగాల్లో విశేష పురోగతి సాధించిందని, ఇందుకు కేసీఆర్ సుపరిపాలనే కారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ లు అరేళ్ళ. మల్లికార్జున్ గౌడ్,బట్టి జగపతి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ రెడ్డి,మాజీ జడ్పీ ఉపాధ్యక్షురాలు యం. లావణ్య రెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిండ్ల ఆంజనేయులు, సీనియర్ నాయకులు సుబ్రభాత్ రావు మున్సిపల్ కౌన్సిలర్ లు బట్టి ఉదయ్ కుమార్, దీపక్ కుమార్, గంగామణి,కో కన్వీనర్ లు కిష్ట గౌడ్,లింగా రెడ్డి,మెదక్ హవెలిఘనపూర్ మండల అధ్యక్షులు అంజ గౌడ్, సిహ్. శ్రీనివాస్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ లు మెదక్ పట్టణం,మెదక్ హవెలిఘనపూర్ మండల నాయకులు,మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కోసం చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తి

- **తెలంగాణ సాధనలో విశేష కృషి చేసిన కుమ్మరి వెంకటేష్‌కు ఘన సన్మానం**
- **సర్పంచ్ పెంటారెడ్డి**

**గుమ్మడిదల (కానుకుంట), జూన్ 2 (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విశేషంగా కృషి చేసిన కుమ్మరి వెంకటేష్ సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కానుకుంట గ్రామ సర్పంచ్ ఇప్ప పెంటారెడ్డి అన్నారు. గుమ్మడిదల మండల పరిధిలోని కానుకుంట గ్రామంలో కుమ్మరి వెంకటేష్‌ను గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అహర్నిశలు శ్రమించిన వారి సేవలు సమాజానికి ఆదర్శమని అన్నారు. తెలంగాణ సాధనలో కుమ్మరి వెంకటేష్ చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. రాష్ట్ర ఆవిర్భావానికి ఆయన అందించిన సహకారం, చూపిన అంకితభావం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ కోసం చేసిన సేవలకు గుర్తింపుగా కుమ్మరి వెంకటేష్‌ను సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు. సమాజ అభివృద్ధిలో సేవలందించిన వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వారి సేవలను గుర్తిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దేవేందర్ గౌడ్,



ఉపసర్పంచ్ పాషా, వార్డు సభ్యులు నాగులు, పెంటేష్, ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అంజత్ ఖాన్, లక్ష్మీనరసింహారెడ్డి, గడ్డం యాదగిరి, నవీన్, ప్రేమ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావు సేవలు తెలంగాణకు దిక్సూచి..!

- **జన్మదిన వేళ శుభాకాంక్షలు తెలిపిన ఆదర్శ్ రెడ్డి..!**
- **నాయకులతో కలిసి ప్రత్యేక భేటీ..!**

**రామచంద్రపురం, జూన్ 2 (సిరి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ శాసనసభా పక్ష ఉపనేత తన్నీరు హరీష్ రావును పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మంగళవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో హరీష్ రావు అందించిన సేవలు రాష్ట్రానికి దిక్సూచిగా నిలిచాయని పేర్కొన్నారు. ముఖ్యంగా నీటిపారుదల, రైతు



సంక్షేమం, వైద్య ఆరోగ్య రంగాల్లో ఆయన చేపట్టిన కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చాయని అన్నారు.ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకుడిగా హరీష్ రావు ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.మంగళవారం తిరుపతి పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ముందస్తుగా హరీష్ రావును కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆదర్శ్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకటేష్ గౌడ్, జిన్నారం మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# కన్నీళ్లు తుడిచిన సొంతింటి కల

- **ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ తో కొత్త వెలుగులు**
- **ఆడబిడ్డల ముఖాల్లో ఆనందం**
- **నీడను కల్పించి జీవితాల్లో వెలుగులు నింపిన ప్రభుత్వానికి**
- **లబ్ధిదారులు నిండు మనసుతో కృతజ్ఞతలు**
- **బొల్లారంలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం**
- **పాల్గొన్న రాష్ట్ర నాయకులు చంద్ర రెడ్డి**

**జిన్నారం జూన్ 2 సిరి న్యూస్**

పేదల కళ్ళలో ఆనందం చూడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ఆరు గ్యారంటీ పథకాల అమలుతో తెలంగాణ స్వర్ణ యుగంలా మారుతుందని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.చంద్రారెడ్డి అన్నారు. బొల్లారం డివిజన్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇల్లును స్థానిక మాజీ కౌన్సిలర్ సంతోషా లక్ష్మారెడ్డి'తో కలిసి ఆయన చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించేందుకు కట్టుబడి ఉందన్నారు. లబ్ధిదారులు తమ సొంత ఇంటి కలను నిజం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు వివేక్ మరియు దామోదర్ రాజనర్సింహాలకు, మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి నీలం మధు మరియు



పాతాన్చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్'లకు బొల్లారం డివిజన్ ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పేదల కళ్ళల్లో నెరవేరిన సొంత ఇంటి కల, పేదరికంపై గెలుపు ఇందిరమ్మ ఇళ్లతో మారిన పేదల రాత, అని అన్నారు.నెరవేరిన దశాబ్దాల కల ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో పూరి గుడిసెల్లో మగ్గిపోతున్న పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ద్వారా శాశ్వత నివాసం లభించింది అని అన్నారు. ఆడ బిడ్డల మొక్కల్లో ఆనందం ఇల్లను మహిళల పేరిట కేటాయించడం వల్ల కుటుంబాలు ఆర్థిక భద్రత ఆత్మవిశ్వాసం పెరిగాయి వారి కళ్ళల్లో ఆనందం స్పష్టంగా కనిపిస్తుందని తెలిపారు. పారదర్శకమైన ఎంపిక ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందాల ప్రభుత్వం తీసుకున్న చర్లపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కృతజ్ఞతల వెల్లువ తమకు నీడను కల్పించి జీవితాల్లో వెలుగులు నింపిన ప్రభుత్వానికి లబ్ధిదారులు నిండు మనసుతో కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ నర్సింలు, శానిటేషన్ ఇంచార్జ్ వినోద్, ఇందిరమ్మ హౌసింగ్ కమిటీ మెంబర్ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్, ఏ.ఈ అభిషేక్, ప్రదీప్ కుమార్, ఆలీ, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు మూర్తి, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ కౌన్సిలర్ నాగరాజు

**రామచంద్రపురం, జూన్ 2 (సిరి న్యూస్):**

తెలంగాణ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదినం సందర్భంగా తెల్లాపూర్ 7వ వార్డు మాజీ కౌన్సిలర్ నాగరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు హరీష్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపిన చొరవ, నాయకత్వం ప్రజల అభిమానాన్ని చూరగొన్నాయని పేర్కొన్నారు.హరీష్ రావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు



# కేసీఆర్ పోరాట ఫలితమే తెలంగాణ రాష్ట్రం

- కాంగ్రెస్ హామీలు గాలికొదిలింది
- తెలంగాణ కోసం 14 ఏళ్ల పోరాటం.
- కేసీఆర్ త్యాగాల ఫలితమే రాష్ట్రం.
- తెలంగాణ అస్తిత్వంపై కుట్రలు జరుగుతున్నాయి.
- కేసీఆర్ తెచ్చిన తెలంగాణలోనే రేవంత్ సీఎం అయ్యారు.
- కాంగ్రెస్ పాలనలో రైతులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.
- ప్రజల కోసమే బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది.
- మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి.




**మెదక్ జూన్,02(సిరిన్యూస్)**

తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ సుదీర్ఘ పోరాటం, త్యాగాల ఫలితంగానే ఆవిర్భవించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, రైతులు, మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి విమర్శించారు. మంగళవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బట్టి. జగపతి పార్టీ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ కోసం 14 సంవత్సరాల పాటు నిరంతర ఉద్యమం సాగించిన కేసీఆర్ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వంపై కుట్రలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. 2001లో డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి గులాబీ జెండా చేతపట్టి సిద్దిపేట నుంచి తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించిన కే. చంద్రశేఖర్ రావు 14 సంవత్సరాల పాటు నిరంతర పోరాటం సాగించి రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు.2009లో కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమంలో కీలక మలుపు తిప్పిందని పేర్కొన్నారు. ఉద్యమంలో అమరులైన శ్రీకాంతాచారి, యాదయ్య, కిష్టయ్య త్యాగాలు చిరస్మరణీయమని, వారి త్యాగ ఫలితమే నేటి తెలంగాణ అని అన్నారు.తెలంగాణ ఏర్పాటైన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించిందని, రైతుబంధు,రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కాలేశ్వరం ప్రాజెక్టు వంటి పథకాల ద్వారా దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కేంద్ర సహకారం లేకుండానే తెలంగాణను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం,తులం బంగారం వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ఆరోపించారు. రైతులు ధాన్యం కోసం, మహిళలు తాగునీటి కోసం రోడ్డెక్కే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు.కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సింగూర్ మరమ్మతుల పేరుతో రైతులకు సాగునీరు అందకుండా చేశారని, రైతులు హెచ్ఆర్సీని ఆశ్రయించిన తర్వాతే నీటి విడుదల జరిగిందని గుర్తు చేశారు.తెలంగాణ అస్తిత్వంపై మళ్లీ కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు.రాష్ట్ర హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమం అవసరమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు.బీజేపీ, కాంగ్రెస్ పార్టీల విధానాల్లో పెద్దగా తేడా లేదని, ప్రజా సంక్షేమంపై రెండూ నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పనిచేస్తుందని, తెలంగాణ ప్రజల అభిలాషలకు అనుగుణంగా ఉద్యమాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈసమావేశంలో జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు యం.లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు,సీనియర్ నాయకులు సుప్రభాత్ రావు,కొ కన్వీనర్లు కృష్ణ గౌడ్, లింగారెడ్డి, కౌన్సిలర్లు బట్టి ఉదయ్ దీపక్ కుమార్, మాయ.గంగమని,మాజీ కౌన్సిలర్లు, అంకం చంద్రకళ,మాయ మల్లేశం,ఆర్ కె. శ్రీనివాస్,భీమరి కిషోర్, మెదక్,హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు యం.అంజాగౌడ్, సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి,మెదక్ పట్టణం,మెదక్, హవెలిఘనపూర్ మండల నాయకులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం

- ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**గుమ్మడిదల, జూన్ 2 (సిరి న్యూస్):**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుమ్మడిదల మండలంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం, మండల అభివృద్ధి కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, కానుకుంట, అనంతారం, నల్లవల్లి, మంబాపూర్, కొత్తపల్లి, నాగిరెడ్డిగూడెం, వీరారెడ్డిపల్లి గ్రామ పంచాయతీల వద్ద జాతీయ జెండాలను ఎగురవేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలు కలిసి తెలంగాణ అమరవీరులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటే నినాదాలు చేస్తూ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేది కోట్లాది మంది ప్రజల ఆకాంక్షలు, ఉద్యమకారుల త్యాగాలు, విద్యార్థుల పోరాటాల ఫలితంగా ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. సామాజిక న్యాయం, స్వయం పాలన, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలతో ఏర్పడిన తెలంగాణ దేశంలోనే అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న రాష్ట్రంగా గుర్తింపు పొందిందని తెలిపారు. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన రాష్ట్రం తెలంగాణ అని, అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తూ ప్రజల ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో తాసిల్దార్ పరమేశం, మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి, మున్సిపల్ కమిషనర్ దశరథ, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్



విష్ణువర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ సంధ్య, కౌన్సిలర్లు ఆకుల మాధవి, మద్ది సోని , విజయలక్ష్మి పద్మ, రాధిక, వరలక్ష్మి, నిర్మల, సప్పటి పద్మ, ప్రమీల, కుమార్ గౌడ్, చక్రపాణి, సంజీవరెడ్డి జైపాల్ రెడ్డి, కత్తుల రమేష్, కిషన్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింగరావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, యువజన సంఘాల నాయకులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.

**రామాయంపేట, జూన్ 2 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 12వ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా జాతీయ జెండా ఆవిష్కరించి సంబరాలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై బాలరాజు, సర్కిల్ కార్యాలయం వద్ద సిఐ సైదా నాయక్, తహసిల్దార్ కార్యాలయం వద్ద తహసిల్దార్ రజనీకుమారి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద చైర్మన్ బాదే చంద్రం, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో షాజీలోద్దీన్ జాతీయ జెండా ఎగరవేసి సంబరాలు నిర్వహించారు. మెదక్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు చింతల స్వప్న స్వామి జాతీయ జెండా



ఆవిష్కరించి సంబరాలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ జాతీయ జెండా ఎగరవేసి సంబరాలు నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షులు అవినాష్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించి సంబరాలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరించి సంబరాలు నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ. ఎంతోమంది త్యాగ ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్ లు గజవాడ నాగరాజు గుప్తా, దేవుని రంజిత్, పుట్టి సందీప్, రవి నాయక్, బైరం స్వప్న కుమార్, దాకి శ్యామల స్వామి, చౌదరి చరిత, మద్దెల మాధవి రమేష్, కో ఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, మహమ్మద్ గౌస్, రాధా భవాని, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు చింతల స్వప్న స్వామి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ బాదే చంద్రం, సొసైటీ సీఈఓ పుట్టి నరసింహులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనీ శెట్టి అశోక్ గుప్తా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, జిల్లా కార్యదర్శి పోచమ్మల గణేష్, తదితరులు పాల్గొన్నారు

# స్కై ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ట్యూషన్ సెంటర్ ప్రారంభం

**హత్నూర, జూన్ 02,(సిరి న్యూస్)**

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు ఏ ఐ విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో స్కై ఆర్గనైజేషన్ చేపట్టిన విద్యా కార్యక్రమాలు గ్రామాల్లో వెలుగులు నింపుతున్నాయి. ఈ కార్యక్రమానికి గుండ్ల మాచునూర్ గ్రామం నుంచి శ్రీకారం చుట్టగా, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హత్నూర మండలంలోని కొన్యాల్ గ్రామంలో నూతన ట్యూషన్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సుజాత సత్యం ముఖ్య అతిథిగా హాజరై ట్యూషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు స్కై ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.స్కై ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు షేక్ మహబూబ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో విద్యా సహాయం అందించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని గ్రామాల్లో ట్యూషన్ సెంటర్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఏ ఐ, కంప్యూటర్ విద్య, పోటీ పరీక్షల శిక్షణ అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్కై ఆర్గనైజేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు స్థానిక యువకులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేసి, వారి భవిష్యత్ విద్యాభివృద్ధికి శుభాకాంక్షలు తెలిపారు.



## గ్రామ గ్రామాన తెలంగాణ ఆవిర్భావ వేడుకలు.



**వెల్దుర్తి,జూన్ 02,(సిరి న్యూస్) :**

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం వెల్దుర్తి మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ గ్రామాన వేడుకలు జరిగాయి. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యాలయాల ఎదుట సర్పంచులు జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ గేయాన్ని ఆలపించారు.ప్రభుత్వ కార్యాలయాల ఎదుట అధికారులు ఘనంగా వేడుకలను నిర్వహించారు.వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. కాంగ్రెస్,బీఆర్ఎస్, పార్టీల నాయకులు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో పాల్గొని తెలంగాణ ప్రాముఖ్యత విశిష్టతను వివరించారు. ఆయా పార్టీ కార్యాలయాల ఎదుట జెండాలను ఎగరవేశారు.

## ఇందిరమ్మ గృహప్రవేశానికి హాజరైన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బండారి గంగాధర్!!

**శివంపేట జూన్ 2 ( సిరి న్యూస్ )**

శివంపేట్ మండల కేంద్రంలోని లింగోజిగూడ తాండ గ్రామంలో నూతన గృహప్రవేశం ధీరావత్ విజయ, కాలేశ్వర్ కు ఇందిరమ్మ ఇల్లు 5 లక్షల రూపాయల నిర్మాణంతో గృహప్రవేశం పూర్తి చేసుకోవడం జరిగింది.నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఇందిరమ్మ ఇల్లు రిబ్బెన కట్టింగ్ చేసిన మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ మాట్లాడుతూ పేదలకు ఇళ్లు అందించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతింటి కల నెరవేరాలని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇల్లు ప్రవేశ పెట్టడం జరిగింది.ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇళ్లు లేని లేని ప్రతి ఒక్కరికి



ప్రభుత్వం అండగా ఉంటుందని వారు ప్రసంగించడం జరిగింది.కాంగ్రెస్ హయాంలోని పేదలకు న్యాయం జరుగుతుందని హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఈ ప్రభుత్వానికి మా కుటుంబం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దొంతి సత్యనారాయణ. బిజిఆర్ యువసేన అధ్యక్షుడు కుమ్మరి నాగరాజు.మెగావత్ హోబ్య. బాబు నాయక్. ధీరావత్ చరణ్ నాయక్. రాజు నాయక్. మాలోత్ చిన్న. పిల్లి మణికంఠ. పెద్దపులి మహేష్ కత్తు. కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్రా అవతరణ దినోత్సవం





**ఝరాసంఘం, జూన్ 2(సిరిన్యూస్)**



యావత్ తెలంగాణ ప్రజలు ఎంతో గర్వంగా పండగ జరుపుకునే రోజు ఈ రోజు . ఎందరో అమరవీరుల త్యాగాలు, దశాబ్దాల పాటు సుదీర్ఘ పోరాటం, సామాన్యుల ఆక్రందనలు, విద్యార్థుల ఆత్మబలిదానాల ఫలితంగా 2014 జూన్ 2న భారత పటంలో నూతన రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. స్వయంపాలన అనే ఐదు కోట్ల ప్రజల ఆకాంక్ష సాకారమై ఇప్పటికి పన్నెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ప్రతి గ్రామంలో జండా పండుగ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.ఈ సందర్బంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరులను త్యాగాల ఫలితమే ఈ తెలంగాణ రాష్ట్రం అని వారినీ స్మరించుకున్నారు.

## హరీశ్‌రావు జన్మదిన వేడుకలను హాజరు కావాలి

- బీఆర్ఎస్ శ్రేణులకు మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి పిలుపు

**గుమ్మడిదల, జూన్ 2( సిరి న్యూస్)**



మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదినం సందర్భంగా గుమ్మడిదల చౌరస్తాలో బుధవారం ఉదయం 10 గంటలకు జన్మదిన వేడుకల కార్యక్రమం నిర్వహించనున్నట్లు గుమ్మడిదల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరీశ్‌రావు ప్రజా సేవ, తెలంగాణ అభివృద్ధికి అందించిన సేవలను స్మరించుకుంటూ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి గుమ్మడిదల మండలం, మున్సిపాలిటీ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మండల, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు సమయానికి హాజరు కావాలని కోరారు.

## వ్యక్తిగత విషయాలపై రూమర్స్.. పరోక్షంగా స్పందించిన త్రిష



తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో నటి త్రిష రిలేషన్‌లో ఉన్నారంటూ వస్తోన్న వార్తలు కొన్ని రోజులుగా సినీ, రాజకీయ రంగాల్లో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. సాధారణంగా తన వ్యక్తిగత విషయాలపై వచ్చే ఇలాంటి వార్తలపై స్పందించని త్రిష (Trisha) పరోక్షంగా స్పందించారు. తన పెంపుడు కుక్క ఫొటోను షేర్ చేసిన ఆమె.. దానికి ఆసక్తికరమైన క్యాప్షన్ పెట్టారు. 'నా వ్యక్తిగత విషయాల్లో తలదూర్చడానికి దీన్ని మాత్రమే అనుమతిస్తాను' అని రాసుకొచ్చారు. నేరుగా ఎవరి పేరు ప్రస్తావించకపోయినప్పటికీ.. తనపై రూమర్స్ క్రియేట్ చేస్తోన్న వారిని ఉద్దేశించే ఆమె ఈ పోస్ట్ పెట్టారని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

ఇక మే నెల ప్రారంభంలో పెట్టినట్లు నెలాఖరులోనూ త్రిష పోస్ట్ పెట్టారు. ఈ నెల మొదట్లో.. 'నాకు ఇష్టమైన మంత్ వచ్చేసింది' అని పెట్టిన ఆమె.. తాజాగా 'ఈ ఏడాది మే నెలను తలచుకున్నప్పుడల్లా నా ముఖంపై చిరునవ్వు వస్తూనే ఉంటుంది' అని కొన్ని ఫొటోలు షేర్ చేశారు. దీనికి 'మ్యాజికల్ మే..' అని క్యాప్షన్ పెట్టారు. ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఈ నెలలోనే త్రిష పుట్టినరోజు ఉండడం, అదే రోజు తన స్నేహితుడు విజయ్ తమిళనాడు ఎన్నికల్లో ఘన విజయం సొంతం చేసుకోవడంతో ఆమె పేరు సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అయింది. దానితో పాటు ఆమె నటించిన 'కరుప్పు' హిట్‌గా నిలిచి రూ.348 కోట్లకు పైగా వసూళ్లు చేసింది.

## టాలీవుడ్ ఇండస్ట్రీపై జాన్వీ ప్రశంసలు..

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ 'పెద్ది' సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. మరో రెండు రోజుల్లో విడుదల కాబోతున్న (జూన్4) ఈ సినిమాలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు సనా కాంబోలో రాబోతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా జాన్వీ టాలీవుడ్, బాలీవుడ్‌ల మధ్య ఉన్న తేడా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాలీవుడ్‌లో పని గంటలకు ఎక్కువ ప్రాధాన్య ఉంటుందని అది తనకు చాలా నచ్చినట్లు తెలిపింది. సౌత్ సినిమా షూటింగ్‌లో అందరిలో ఒకరకమైన ఆసక్తి ఉంటుంది. అక్కడ కేవలం ఓ ప్రాజెక్ట్ పూర్తి చేయాలనో డెడ్‌లైన్లలో అందుకోవాలనో మాత్రమే పనిచేయరని అన్నారు. సినిమాలోని ప్రతీ సీన్ అద్భుతంగా రావాలనే ప్రయత్నిస్తారని.. దానికోసం ఎంత సమయాన్ని అయినా కేటాయిస్తారని ప్రశంసించారు. హిందీ సినిమా విషయానికొస్తే.. అక్కడ బడ్జెట్, టైమ్‌లైన్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని.. అంతా రూల్ ప్రకారం జరుగుతుందని తెలిపింది.



కొన్నిసార్లు అతిజాగ్రత్తల వల్ల క్రియేటివిటీ విషయంలో రాజీపడాల్సి వస్తుందని.. అలాగే పక్కా ప్రణాళికల వల్ల ప్రయోజనాలు కూడా ఉన్నాయని అన్నారు. ఇక తెలుగులో సినిమా సెట్స్‌లో బ్రేక్ టైమింగ్స్ కూడా చాలా ఖచ్చితంగా పాటిస్తారని జాన్వీ పేర్కొన్నారు. అక్కడ లంచ్ బ్రేక్ ఇస్తే, ప్రతి ఒక్కరూ కంగారు పడకుండా సుమారు 40 నిమిషాల పాటు ప్రశాంతంగా భోజనం చేయడానికి సమయం దొరుకుతుందని.. ఆ తర్వాత పని ప్రారంభించే ముందు కనీసం ఒక 20 నిమిషాల పాటు చిన్నపాటి నిద్ర తీసేందుకు కూడా వీలుంటుందని చెప్పారు. అయితే, ఇలాంటి సౌకర్యాలు కొన్నిసార్లు తమ బాలీవుడ్ ఇండస్ట్రీలో లోపిస్తాయని, అక్కడ ఈ విషయాల్లో కాస్త రాజీ పడాల్సి వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, తాను తెలుగులో చేసిన ప్రాజెక్ట్‌ల సమయంలో ఎప్పుడూ లాంగ్ షిఫ్ట్‌లు చేయాల్సిన అవసరం రాలేదని జాన్వీ గుర్తుచేసుకున్నారు. కేవలం ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే 12 గంటల పాటు షూటింగ్‌లో పాల్గొన్నానని.. మిగతా అన్ని రోజుల్లో కేవలం 9 నుండి 10 గంటల లోపే తన పని ముగించుకుని ప్యాకప్ చెప్పేవాళ్లని తెలిపారు.

## ప్రభాస్ స్పిరిట్‌లో ఆ స్టార్ నటి.. మరోసారి హిట్ కాంబో రిపీట్..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న వరుస ప్రాజెక్టులలో 'స్పిరిట్' ఒకటి. సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌ను టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై భూషన్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇందులో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా.. క్రిష్ ఫేమ్ వివేక్ ఒబెరాయ్ పవర్ ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా.. తాజాగా ఓ సూపర్ అప్డేట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. స్పిరిట్‌లో నటి నదియా ఓ కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు టాక్. ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరుగుతుండగా.. ఆమె షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టినట్లు తెలుస్తుంది. ఈ మేరకు నటీనటులకు ఏర్పాటు చేసిన క్యారివ్యాన్‌కు సంబంధించిన దాంట్లో నటి నదియా పేరు మీద క్యారివ్యాన్ రిజర్వ్ చేసి ఉంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించి వీడియో వైరల్ అవుతుండగా.. స్పిరిట్ చిత్రంతో మరోసారి ప్రభాస్‌తో నదియా స్క్రీన్ చేసుకోబోతుందని తెలిసి ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. కాగా.. ప్రభాస్, నదియా కాంబోలో ఇప్పటికే 'మిర్చి' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో ప్రభాస్ తల్లి పాత్రలో నదియా నటించగా.. తల్లీకొడుకులుగా ప్రభాస్, నదియా కాంబోకు ఫుల్ క్రేజ్ ఏర్పడింది. ఇప్పుడు వీరిద్దరు స్పిరిట్ కోసం కలిసి వర్క్ చేస్తుండగా.. ఈసారి నదియా ప్రభాస్ పక్కన ఎలాంటి పాత్ర పోషిస్తుందని అభిమానుల్లో క్యూరియాసిటీ పెరిగింది.







## రణ్‌వీర్‌పై బ్యాన్.. కోర్టును ఆశ్రయించిన నిర్మాత


బాంబే సివిల్ కోర్టులో ప్రముఖ నిర్మాత టీపీ అగర్వాల్ దాఖలు చేసిన పిటిషన్ బాలీవుడ్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్‌పై (Ranveer Singh) 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' విధించిన నాన్ కోఆపరేషన్ ఆదేశాలకు వ్యతిరేకంగా ఆయన ఈ న్యాయపోరాటానికి దిగారు. చలనచిత్ర పరిశ్రమకు చెందిన ఏ సభ్యుడి మీద నిషేధం విధించి ఉత్తర్వులు జారీ చేసే అధికారం ఏ సంస్థకూ లేదని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

దీనిపై టీపీ అగర్వాల్ మాట్లాడుతూ ''చిత్ర పరిశ్రమలో ఎవరి పైనా నిషేధాలు, ఆదేశాలు జారీ చేసే హక్కు ఎవరికీ లేదు. ఎఫ్‌డబ్ల్యూఐసీఈ (FWICE) లాంటి సంస్థలకు ఇలా చేసే హక్కు అస్సలు లేదు. గతంలో నేను, దర్శకుడు విపుల్‌షా కలిసి ఇలాంటి ధోరణులకు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు చేశాం. సినిమా రంగం అనేది పరస్పర సహకారంతో నడిచే ఓ సృజనాత్మక వేదిక. ఇలాంటి సున్నితమైన విషయాలను చట్టపరమైన, వృత్తిపరమైన మార్గాల్లోనే పరిష్కరించుకోవాలి. ఒక వ్యక్తితో ఎవరూ పనిచేయకూడదంటూ బలవంతం చేయడం, నిరుత్సాహపర్చడం లాంటి చర్యలను తేలికగా తీసుకోకూడదు. ఇలాంటి నిర్ణయాల వల్ల ఎంతోమంది జీవనోపాధి దెబ్బతినడమే కాకుండా, సృజనాత్మక స్వేచ్ఛకు విఘాతం కలుగుతుంది. అందుకే ఈ వ్యవహారాలను పారదర్శకంగా, చట్టబద్ధంగా పరిష్కరించాలి'' అని అన్నారు.



## అవకాశాలు లేకున్నా చేతినిండా సంపాదిస్తున్న ఈషా రెబ్బా..

టాలీవుడ్ హీరోయిన్లు సినిమా అవకాశాలు రాకపోవడంతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా డబ్బులు సంపాదించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్తగా వచ్చిన సబ్‌స్క్రిప్షన్ అనే ఆప్షన్‌ను వాడుకుంటూ ఆదాయం పొందుతున్నారు. ఈ పద్ధతిలో హీరోయిన్ల పర్సనల్ ఫోటోలు, వీడియోలు చూడాలంటే అభిమానులు ప్రతి నెల కొంత డబ్బులు కట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే టాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల ఈ సబ్‌స్క్రిప్షన్ ద్వారా నెలకు ఒక్కో ఫాలోవర్ నుండి రూ. 299 వసూలు చేస్తోంది. అలాగే రామ్ చరణ్ 'చిరుత' సినిమా హీరోయిన్ నేహా శర్మ కూడా ఇదే బాటలో నడుస్తూ డబ్బు సంపాదిస్తోంది. తాజాగా, మన తెలుగు బ్యూటీ ఈషా రెబ్బా కూడా ఇదే ట్రెండ్‌ను ఫాలో అవుతుండటం ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈషా రెబ్బా మిగతా హీరోయిన్ల కంటే ఒక అడుగు ముందుకు వేసి, తన ఇన్‌స్టాగ్రామ్ సబ్‌స్క్రిప్షన్ కోసం నెలకు ఏకంగా రూ. 390 ఛార్జ్ చేస్తోంది. గత ఏడాది 'ఓం శాంతి శాంతి శాంతి' అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఈ అమ్మడికి, ప్రస్తుతం టాలీవుడ్‌లో పెద్దగా అవకాశాలు లేవు. అందుకే ఈమె ఈ సబ్‌స్క్రిప్షన్ దారి పట్టినట్లు తెలుస్తోంది. ఫాలోవర్స్ సంఖ్యను బట్టి చూస్తే ఈమెకు నెలకు కూర్చున్న చోటే భారీగా ఆదాయం వచ్చేలా ఉంది. కానీ, ఈషా రెబ్బా తీసుకున్న ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. కేవలం డబ్బుల కోసమే హీరోయిన్లు ఇలాంటి పద్ధతులు వాడుతూ దిగజారిపోవాలా? అంటూ నెట్టింట ఘాటుగా కామెంట్స్ చేస్తూ ఫైర్ అవుతున్నారు.



## 'పెద్ది' సినిమాకి అసలు ట్రైలరే అక్కర్లేదు.. కంటెంట్ ఉన్నోడికి కట్ అవుట్ చాలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ – దర్శకుడు బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో చిత్ర యూనిట్ వరుస ప్రమోషన్లతో హోరెత్తిస్తోంది. అయితే ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ గురించి సోషల్ మీడియాలో భారీ చర్చ నడుస్తున్న వేళ, డైరెక్టర్ బుచ్చిబాబు చేసిన సంచలన కామెంట్స్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. అసలు పెద్ది సినిమాకు ట్రైలర్ అవసరం లేదంటూ ఆయన చేసిన బోల్డ్ కామెంట్స్ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి.

**ట్రైలర్లు చూసే సినిమాలకు వెళ్తున్నామా ఏంటి..**

సినిమా రిలీజ్ దగ్గరపడుతున్నా ఇప్పటివరకు అధికారిక ట్రైలర్ రాకపోవడంపై ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు బుచ్చిబాబు తనదైన శైలిలో స్పందించారు. "ఇంత బజ్ ఉన్న 'పెద్ది' సినిమాకి రిలీజ్ ట్రైలర్ అక్కర్లేదు.. అసలు ఈ సినిమాకి ట్రైలర్ కూడా అక్కర్లేదు. ఒకప్పుడు మనం అన్ని సినిమాలకీ ట్రైలర్లు చూసే థియేటర్లకు వెళ్లే వాళ్లమా ఏంటి? కథపై, కంటెంట్‌పై మాకు అంత నమ్మకం ఉంది" అని బుచ్చిబాబు కుండబద్దలు కొట్టారు. సినిమాపై ఉన్న విపరీతమైన హైప్ దృష్ట్యా కేవలం ప్రమోషనల్ కంటెంట్, సాంగ్స్ చాలని ఆయన అభిప్రాయపడ్డారు.

సినిమా పోస్ట్ ప్రొడక్షన్, ప్రమోషన్లపైనే పూర్తి దృష్టి పెట్టడం కోసం బుచ్చిబాబు డిజిటల్ ప్రపంచానికి దూరంగా ఉంటున్నట్లు వెల్లడించారు. "నేను ప్రస్తుతం సోషల్ మీడియాలో లేను. నా ఫోన్ లో ఉన్న అన్ని సోషల్ మీడియా యాప్స్ డిలీట్ చేసేసాను" అని బుచ్చిబాబు షాకింగ్ నిజం చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు, ట్రోల్స్ లేదా అనవసరమైన చర్చలకు దూరంగా ఉంటూ, కేవలం థియేటర్లలో ప్రేక్షకులకు బెస్ట్ అవుట్‌పుట్ ఇవ్వడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ట్రైలర్ లేకుండానే సినిమాను థియేటర్లలోకి తెస్తున్నారంటే 'పెద్ది' అవుట్‌పుట్ ఏ రేంజ్‌లో వచ్చిందో అర్థం చేసుకోవచ్చని మెగా ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. మరి ట్రైలర్ లేకుండానే జూన్ 4న బాక్సాఫీస్ బరిలోకి దిగుతున్న మెగా పవర్ స్టార్ 'పెద్ది' ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

## నాని కొత్త సినిమా ప్రచారం.. నిజమే లేదట!



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని కేవలం నటుడిగానే కాకుండా.. తన సొంత నిర్మాణ సంస్థ 'వాల్ పోస్టర్ సినిమా' బ్యానర్‌పై వైవిధ్యమైన సినిమాలను నిర్మిస్తూ నిర్మాతగానూ టాలీవుడ్‌లో సరికొత్త మైలురాళ్లను అందుకుంటున్నారు. ఇటీవలే ఈ బ్యానర్ నుండి వచ్చిన 'కోర్టు' సినిమా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ సాధించడంతో, నాని తన ప్రొడక్షన్ హౌస్‌లో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులను లైన్‌లో పెట్టేందుకు ప్లాన్ చేస్తున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో విపరీతంగా బజ్ నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే, నాని లైనప్ మరియు వాల్ పోస్టర్ సినిమా రాబోయే చిత్రాల గురించి నెట్టింట ప్రచారంలో ఉన్న వార్తలపై నిర్మాణ సంస్థ స్పందిస్తూ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది.

ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతున్న సమాచారం ప్రకారం.. నాని ప్రస్తుతం నటుడిగా 'ది ప్యారడైజ్' షూటింగ్‌తో ఫుల్ బిజీగా ఉన్నారని, ఈ చిత్రం ఆగస్టు విడుదలకు సిద్ధమవుతోందని ప్రచారం జరుగుతోంది. దీని తర్వాత రన్ రాజా రన్, సాహో ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'బ్లడీ రోమియో' సినిమాను ఈ ఏడాది చివర్లో ప్రారంభించనున్నట్లు టాక్. ఇక నిర్మాతగా వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై మూడు ప్రాజెక్టులు చర్చల్లో ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో వార్తలు వస్తున్నాయి. 'బ్యాండ్ మేళం' (హర్ష్ రోషన్, శ్రీదేవి ప్రధాన పాత్రలు) చిత్రంతో దర్శకుడిగా పరిచయమైన సతీష్ జవ్వాజి చెప్పిన ఒక సరికొత్త ఐడియా నానికి నచ్చిందని, రీసెంట్‌గా ఫైనల్ స్క్రిప్ట్ లాక్ చేసి లీడ్ యాక్టర్ల కోసం అన్వేషణ మొదలుపెట్టారని ప్రచారం సాగుతోంది.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.